J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 38 24.02.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి





# 'రాహు'కాల యోగం ఉందా?

## తాత, నానమ్మ, నాన్నల వారసత్వం కొనసాగుతుందా??

*ఇందిరమ్మ మనుమడు రాహుల్‌గాంధీ చేసిన "భారత్ జోడో" యాత్ర వల్ల కేవలం జోళ్ళు అరిగిపోవడమేనా..? ఫలితం ఏమైనా ఉంటుందా..?? ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో నడుస్తున్న చర్చ ఇది. చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ పూర్తిగా చచ్చిపోయింది. కొన్ని రాష్ట్రాలలో కొనఊపిరితో కొట్టకలాడుతోంది. ఢిల్లీ కోటలో శాశ్వతంగా పాగా వేయాలన్న దృఢ సంకల్పంతో వ్యూహాత్మకంగా భాజపా పావులు కదుపుతోంది. అదే వ్యూహంలో భాగంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు చేసే క్రమంలో ప్రాంతీయపార్టీలను పెంచి పోషిస్తోంది. అయితే భవిష్యత్తులో ఆయా రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు జగన్‌మోహన్‌రెడ్డి తరహాలో కమలానికి కొమ్ము కాస్తాయా..? లేక కేసీఆర్ తరహాలో కాలుదువ్వుతాయా..?? అన్నది ప్రశ్నార్థకమే..!*

తాజాగా ప్రధాని – అదానీ సంబంధాలపైన పార్లమెంటులో రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం రాజకీయవర్గాలను బాగా ఆకట్టుకుంది. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలో స్థానిక మిత్ర బంధంగా ఏర్పడిన ప్రధాని – అదానీ అనుబంధం, జాతీయస్థాయిని దాటి అంతర్జాతీయస్థాయిలో సంచలన సంబంధంగా మారిందని రాహుల్ విమర్శించాడు. అదానీ ఆర్థిక గోల్మాళ్ళ వ్యవహారాన్ని భాజపా పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణంలా బూతద్దంలో చూపించే ప్రయత్నం చేశాడు. గత ప్రభుత్వాలలో, ముఖ్యంగా కాంగ్రెస్ పాలనలో జరిగిన భారీ కుంభకోణాలకంటే ఇది అతి పెద్దదిగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు.

1975లో రాహుల్ నానమ్మ ఇందిరమ్మ కాలం నుండీ 2013లో ఆయన తల్లి సోనియమ్మ హయాం వరకూ ఒకసారి గతాన్ని పరిశీలించి చూస్తే... 1971లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాయ్‌బరేలి నుండి పోటీ చేశారు. అయితే ఆ సమయంలో ఆమె తన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణ ఎదుర్కొన్నారు. ఏష్పాల్ కపూర్ అనే ప్రభుత్వ ఉద్యోగిని ఆమె ఎలక్షన్ ఏజెంటుగా నియమించుకున్నారన్నది అప్పటి ఆరోపణ. ఇందిరాగాంధీపై పోటీ చేసిన రాజ్‌నారాయణ్ సదరు ఆరోపణ చేస్తూ ఈ వ్యవహారంలో కోర్టుని ఆశ్రయించాడు. ఆరోపణ రుజువు కావడంతో 1975 జూన్12న అలహాబాద్ కోర్టు ఆమెను ప్రధానిగా అనర్హురాలిగా కూడా ప్రకటించింది. ఆ తరువాత 1976లో ఇంధన సరఫరా వ్యవహారంలో

10లో








## ఫలించనున్న కోరిక - ఫలితమిస్తున్న ఓపిక

# శాసనమండలి స్థానానికి మేరిగ మురళి

**రాజకీయాలలో ఓర్పు, నేర్పు, వినయం, విధేయత ఒంటబట్టించుకుంటే ఉన్నత శిఖరాలు ఎక్కే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని నిరూపించారు వైఎస్ఆర్ కాంగ్రెస్ నేత మేరిగ మురళి.**

రాపూరులో 1969లో జన్మించిన మేరిగ మురళి రాజనీతి శాస్త్రంలో పీజీ చేసిన విద్యాధికుడు. గూడూరు నుంచి 1973లో స్వతంత్ర్య అభ్యర్థిగా, 1983లో నెల్లూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన తన తండ్రి మేరిగ రామక్రిష్ణయ్య రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని జిల్లాలో ఒక సీనియర్ నాయకుని అనుచరుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో దళితనేతగా ఎదిగారు. 1995లో రాపూరు జడ్పీటీసీగా గెలుపొందడం ద్వారా మరింత గుర్తింపు పొందారు.

### జగన్‌కి తోడుగా...

మహానేత వైఎస్ఆర్ మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పుయాత్రలో మమేకమై జగన్‌కి తోడుగా, విశ్వసనీయమైన దళిత నేతగా కొనసాగారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కూడా కొంత కాలం పనిచేశారు.రాజకీయంగా మరో మెట్టు ఎక్కాలని చేసిన ప్రయత్నాల్లో భాగంగా 2014, 2019లో గూడూరు నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ పదవి వరించినా, ఆ సంస్థపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంపకాల నీలినీడలు కమ్ముకోవడంతో ఆ పదవి కూడా అలంకార ప్రాయంగా మిగిలిపోయింది.

పదవులు అందని ద్రాక్ష పండ్లుగా మారుతున్నా.. మురళి ఎక్కడా నిరాశ, నిస్పృహకు లోనుకాలేదు. పార్టీ పట్ల విధేయత ఎంతమాత్రం సడలలేదు. మెరుగైన నేత 'మేరిగ మురళి' అనేలా వ్యవహరించారు. తాను చదివిన రాజనీతి శాస్త్రాన్ని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో...

10లో




# దొంగలు బాబోయ్!.. దొంగలు!

- నెల్లూరులో పట్టపగలే దోపిడీ
- చంపుతామని వృద్ధురాలిని బెదిరించారు
- 8 సవర్ల బంగారు నగలు లాక్కుపోయారు

నెల్లూరులో చోరీలు, దోపిడీలు పెరిగిపోతున్నాయి. మొన్నటికి మొన్న నగరంలోని న్యూ మిలిటరీ కాలనీలో ఉన్న ఓ ఇంట్లోకి నలుగురు దోపిడి దొంగలు జొరబడి తండ్రిని, కుమార్తెను తాళ్ళతో కట్టేసి, కత్తితో బెదిరించి ఆ ఇంట్లో ఉన్న నగలు, డబ్బు దోచుకుపోయారు. అదేరోజు రాత్రి కొండాయపాళెంగేటు దగ్గరున్న గనుల శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఇంటిని దొంగలు కొల్లగొట్టారు. ఇంటికి తాళం వేసి ఉంటే, తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న దాదాపు దాదాపు కోటి 74 లక్షలకు పైగానే బంగారు, డబ్బు దొంగలు అపహరించుకుపోయారు. ఈ భారీచోరీలతో జనం బెంబేలెత్తుతుంటే, మళ్ళీ తాజాగా ఏసీనగర్ పోస్టాఫీసు వీధిలో ఇటీవల పట్టపగలే దొంగలు ఇంట్లోకి ప్రవేశించి గట్టుపల్లి హేమలత అనే ఓ 74 ఏళ్ళ వృద్ధురాలిపై దాడిచేసి 8 సవర్ల బంగారు నగలు దోచుకుపోవడం స్థానికులను హడలెత్తించింది. మధ్యాహ్నం 2.30 గంటలప్పుడు తలుపులు తెరచి ఉన్న ఆ ఇంటి వరాండాలోకి ఇద్దరు అగంతకులు వచ్చి 'సార్! సార్!' అని ఎవరో పిలిస్తే, ఆ వృద్ధురాలు బయటకు రావడం, వాళ్ళని చూడగానే అనుమానం వచ్చి లోపలికి వెళ్ళి తలుపులు వేసుకునేలోగా, వాళ్ళు ఆమెను లోపలికి నెట్టి, అరిస్తే చంపేస్తామని బెదిరించి, ఆమె వంటిమీదున్న బంగారుగాజులు, మెడలో ఉన్న బంగారు సరుడు, చెవిలో కమ్మలను లాక్కొని పరారుకావడం అంతా నిమిషాల్లోనే జరిగిపోయింది. ఆమె తేరుకుని కేకలు వేసేలోగానే దొంగలు పారిపోయారు. ఆమె కుమారుడికి ఈ విషయం తెలిసి పోలీసులకు తెలియచేయడంతో నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, బాలాజీనగర్ ఇన్స్పెక్టర్ రాములునాయక్‌లు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయినా, దొంగలు ఇంత నిర్భయంగా ఇళ్లలోకి వచ్చి దోపిడీలు చేస్తుండడంతో జిల్లావ్యాప్తంగా ప్రజల్లో భయాందోళనలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులకు ఈ దోపిడీలు పెద్దసవాల్‌గా మారుతున్నాయి.



## భక్తులతో కళకళలాడిన..
# మైపాడు సముద్రతీరం

మహాశివరాత్రి జాగరణ అనంతరం భక్తితో సముద్రస్నానాలను ఆచరించే సంప్రదాయంలో భాగంగా పెద్దసంఖ్యలో భక్తజనులు సముద్రతీరాలకు తరలి రావడంతో ఆ ప్రాంతాలన్నీ భక్తజనంతో కళకళలాడాయి. ముఖ్యంగా జిల్లాలోని ప్రసిద్ధ సాగరతీరం మైపాడు బీచ్‌కి ఈనెల 19న వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలాచరించారు. అనంతరం మైపాడులోని శివాలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేసి తరించారు.

## రాపూరమ్మ అమ్మవారికి..
# వైభవంగా కుంభాభిషేకం



రాపూరం గ్రామదేవత శ్రీ రాపూరమ్మ అమ్మవారి దేవాలయం పునఃప్రతిష్టలో భాగంగా ఇటీవల గ్రామస్తులు ఆలయంలోని యాగశాలలో ప్రత్యేకపూజలు, కలశపూజలు చేసి, కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ఆలయ అర్చకులు అమ్మవారికి సామూహిక కుంకుమపూజలు చేశారు. రాత్రి 7గంటలకు అంగరంగవైభవంగా జరిగిన గ్రామోత్సవానికి జనం కిటకిటలాడారు. రాపూరు ఇన్‌చార్జి సిఐ రవినాయక్, ఎస్ఐ కాంతికుమార్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## కోనలో..
# అన్నదానానికి విరాళాలు


జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో శాశ్వత అన్నదానానికి ఇటీవల హైదరాబాద్‌లోని కంబాలకుంటకు చెందిన బండ్ల నరసయ్య-కాంతమ్మ దంపతులు 2 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. అదే విధంగా, వెంకటగిరి మండలం ఎన్‌జిఓ కాలనీకి చెందిన గోలా పెంచలయ్య-సులోచనమ్మ దంపతులు లక్షా నూటపదహారు రూపాయలను ఆ పథకానికి విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాలను ఆలయ అధికారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలకు దైవదర్శనం చేయించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

## మార్చి 2 నుంచి..
# కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసిన శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మార్చి 2 నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆమేరకు అధికారులు, ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలు మార్చి 2న గిరిప్రదక్షిణతో ప్రారంభమవుతాయి. 3న శేషవాహనోత్సవం, 4న హనుమంత వాహనసేవ, 5న గరుడసేవ, 6న తెప్పోత్సవం, గజవాహన సేవ, 7న కల్యాణోత్సవం, రథోత్సవం, 8న చక్రస్నానం, అనంతరం ఏకాంత సేవ జరుగనున్నాయని ఆలయవర్గాలు తెలిపాయి.

## రూరల్ బిఎస్పీ కన్వీనర్‌గా
# సాయికుమార్

నెల్లూరు రూరల్ నియోజకవర్గ బిఎస్పీ కన్వీనర్‌గా కోదూరుపాడుకు చెందిన బత్తల సాయికుమార్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి శ్రీరాం ఈనెల 19న ఆయనకు నియామకపత్రం అందజేశారు.



## అన్నపూర్ణలాంటి ఆంధ్రను..

# అరాచకాలకు అడ్డాగా మార్చారు

### టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ధ్వజం



రాష్ట్రంలో వైకాపా పాలనలో నేతలు అన్నపూర్ణలాంటి ఆంధ్రను..అరాచకాలకు అడ్డాగా మార్చారని, ఇంతటి ఘోర పరిస్థితులు రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేవని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, పట్టపగలే పోలీసుల సమక్షంలోనే దాడులు చేయడం... తిరిగి బాధితులపైనే కేసులు పెడుతుండడం ఘోరమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యుద్ధంలో సైనికుల్లా పోరాడాలని, తాడోపేడో తేల్చుకుందామని ఆయన పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన ముత్తుకూరు మండలం పంటపాళెంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ పరిశీలకులు, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర తదితరుల సమక్షంలో సోమిరెడ్డి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమై పోయిందన్నారు. చరిత్రలోనే ఎన్నడూ ఎరగని దుర్మార్గాలను చూస్తున్నామన్నారు. అక్రమార్జన తప్ప అన్నదాతల గోడు పట్టని వ్యక్తి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని, వ్యవసాయశాఖ మంత్రిగా రైతుల కోసం కనీసం ఒక్క సమీక్ష నిర్వహించిన పాపాన పోలేదని కాకాణిపై ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

### ఇదేం ఖర్మ రాష్ట్రానికి?..

మన తాతల కాలం నుంచి వస్తున్న ఆస్తులకు జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో, పేరు పెట్టడం ఏమిటి?..ఇదేం ఖర్మ రాష్ట్రానికి?..అంటూ సోమిరెడ్డి ఈనెల 22న తోటపల్లి గూడూరు మండలం సౌత్‌ఆములూరులో జరిగిన కార్యక్రమంలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలన అత్యంత దారుణంగా ఉందని, ఆయనకు ప్రత్యేక చట్టాలేమైనా ఉన్నాయా?..ఇదేం పాలన?.. అంటూ విమర్శించారు. రైతులు గిట్టుబాటు ధరలు లేక అవస్తలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉన్నతవిద్యలు చదువుకున్నవారు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించి వైఎస్సార్సీపికి గుణపాఠం చెప్పాలన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల..

# నామినేషన్ల సందడి

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు ఈనెల22న అధిక సంఖ్యలో చిత్తూరుకు వెళ్ళి, అక్కడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

### పేర్నాటి, పర్వతరెడ్డి నామినేషన్లు...

పట్టభద్రుల స్థానానికి వైకాపా అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ స్థానానికి వైకాపా అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 22న తమ నామినేషన్లు దాఖలు చేశారు. డెప్యూటి సిఎం నారాయణస్వామి, మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌కె రోజా, ఆదిమూలం సురేశ్‌తో పాటు వైకాపా రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, కల్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.



# దోపిడిదొంగలు దొరికారు

## • 3.40 లక్షల సొత్తు స్వాధీనం



పట్టపగలే దోపిడీకి పాల్పడి నగరప్రజలను హడలెత్తించిన ఇద్దరు దోపిడి దొంగలు ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయారు. ఈనెల 16న నెల్లూరు ఏసీ నగర్‌లోని పాత పోస్టాఫీసు రోడ్డులో విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయిని గట్లుపల్లి హేమలత ఇంట్లో దోపిడి దొంగలు ప్రవేశించి, ఆమెను కత్తితో బెదిరించి 8 సవర్ల బంగారు గాజులు, సరుడు, కమ్మలను దోచుకున్న దోపిడిగాళ్ళను బాలాజీనగర్ పోలీసులు అత్యంత చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారు. ఈనెల 22న నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి నెల్లూరులోని తన కార్యాలయంలో బాలాజీనగర్ ఇన్స్‌పెక్టర్ రాములునాయక్‌తో కలసి ఆ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. బాలాజీనగర్ ఎస్ఐ సుమన్, క్రైమ్ పోలీసులు బృందాలుగా ఏర్పడి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారని, సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దొంగలు పాతనేరస్తులని తెలిసిందని డిఎస్పీ పేర్కొన్నారు. ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేట పంచాయతీ పాగావారిపాళెంకు చెందిన మనుబోలు అభిషేక్, నెల్లూరు రూరల్ మండలం నారాయణ రెడ్డిపేట లక్ష్మీగణపతివారివీధికి చెందిన ఎల్.రాంబాబులు ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించామని, నిందితులిద్దరినీ నగరంలోని ఎస్‌విజిఎస్ కళాశాల వద్ద అదుపులోకి తీసుకుని, వారి నుంచి 8 సవర్ల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

### బీవీనగర్‌లో భారీ చోరీ.. 12 లక్షల సొమ్ము దొంగలపాలు

నెల్లూరులోని బీవీనగర్‌లో కృష్ణంరాజు అనే వ్యక్తి ఇటీవల తమ ఇంటికి తాళం వేసి, బంధువులున్న చిలకలమర్రి గ్రామానికి వెళ్ళారు. అది గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువా తలుపులు తెరచి దాదాపు 12 లక్షల రూపాయల విలువజేసే బంగారునగలు, వెండి వగైరాలన్నీ మూటగట్టుకుపోయారు. ఊరి నుంచి తిరిగివచ్చాక చూస్తే.. ఇంకేముందీ, బీరువాలో ఉన్న 80వేల రూపాయలతో సహా, 28 సవర్ల బంగారు నగలు, 1300 గ్రాముల వెండి వస్తువులు దొంగలపాలయ్యాయని బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయపాళెం పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీమ్‌ను రప్పించారు. ఇన్స్‌పెక్టర్ కె.నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు.





ఉత్తరక్రియలు

మమతానురాగాల దీప్తి, అమృతమూర్తి, మా అమ్మ
శ్రీమతి ముంగమూరు ఇందిరమ్మ గారు
తేది. 18.02.2023 శనివారం నాడు బెంగళూరులో స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
ముంగమూరు జగన్‌మోహన్‌రెడ్డి - సుమన
ముంగమూరు సుకేష్‌రెడ్డి - మాలిని

మనుమలు
ముంగమూరు రామ్‌కౌశిక్
ముంగమూరు శంతన్‌రెడ్డి
ముంగమూరు సాయి సర్వేష్

మనుమరాలు
నర్రెడ్డి హిమజ - అనురాగ్‌రెడ్డి

మరియు
ముంగమూరు కుటుంబసభ్యులు

పెద్దకర్మ : తేది. 02.03.2023 గురువారం ఉదయం 11.30 గంటలకు బెంగళూరులోని (నెం.876, గీతాంజలి లే అవుట్, న్యూ తిప్పసంద్ర, HAL 3rd Stage) మా స్వగృహం నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది. సెల్: 98454 34599, 98450 50599


లాయర్
ఫిబ్రవరి 24, 2023

# మాతృభాష పరిరక్షణ..మాటలకే పరిమితమా?..

'అమ్మ భాష' అమృతం అన్నారు పెద్దలు. తల్లి ఉగ్గు పాలతో, ఆ తర్వాత గోరుముద్దలతో నేర్పించే భాషే మాతృభాష. ప్రతి మనిషికి అమ్మభాషే తొలి భాష. పుట్టగానే అమ్మ నుంచి వచ్చే భాష కనుకే, అది 'మాతృభాష' అయింది. అలాంటి మన మాతృభాష ఇప్పుడు అన్నివిధాలా అనాదరణకు గురవుతోంది. మాతృభాష పరిరక్షణ అనేది మాటలకే పరిమితమవుతోంది. మన భాషను మనమే విస్మరిస్తుండడం అందుకు ప్రధాన కారణం. ప్రపంచంలో ఎన్నో భాషలున్నాయి. మనదేశంలోనూ భిన్నమైన భాషలు, భిన్న సంస్కృతులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వేలాది భాషలు, అనేకరకాల మాండలికాలు ప్రజాజీవనంతో ముడిపడివున్నాయి. అందులోనూ, మన తెలుగుభాష ఎంతో ప్రాచీనమైనది..మరెంతో మధురమైనది. దానిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి విధి. తెలుగు వ్యాకరణం, కమ్మనైన తెలుగుభాష, తెలుగు పద్యం, తెలుగుభాషా ఔన్నత్యం ఇవన్నీ తెలుగువారి సొత్తు. అయితే, దురదృష్టమేమంటే రానురాను మన తెలుగుభాషను మనం విస్మరిస్తుండడం విచారకరం. మాతృభాషలో చదువుకోవడం, రాయడం, మాట్లాడుకోవడం వంటివి క్రమేణా తగ్గిపోతే, ఇక ఆ భాష కనుమరుగయ్యే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలా అంతరించిపోయే భాషల్లో తెలుగు భాష ఒకటి కాకూడదు. అందుకే ఇప్పటినుంచే తెలుగువారంతా కంకణబద్ధులు కావాలి. అమ్మభాషను పరిరక్షించుకుంటూ బడిలో, గుడిలో ఎక్కడైనా సరే మాతృభాషనే మాట్లాడుకోవాలి. భాష అనేది మన వారసత్వ సంపద. అది మన చైతన్యానికి ప్రతీక. మన సంస్కృతి సంప్రదాయలకు నిలువుటద్దం. మన ఉనికిని చాటేది మన భాషే. అందుకే, ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు.. కానీ, మాతృభాషను మాత్రం విస్మరించకూడదంటారు పెద్దలు. అయితే దురదృష్టవశాత్తూ, మాతృభాషల పరిరక్షణకు ప్రభుత్వాల నుంచి కూడా ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడం లేదు. అధికారభాషా చట్టం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా, పరిపాలనలో పూర్తిస్థాయిలో తెలుగు ఎక్కడుంది?.. మాతృభాషను పరిరక్షించడానికి మన ప్రభుత్వాల మాటలన్నీ నీటిమూటలుగానే ఉంటున్నాయి తప్ప ఆచరణలో ఆశించిన లక్ష్యాన్ని సాధించాయా?.. పాఠశాలల్లో విద్యాబోధన కనీసం ప్రాథమికస్థాయి వరకైనా తెలుగులోనే ఉండాలన్న ఆశలు కూడా నెరవేరడం లేదు. ఉన్నత విద్యలు కూడా మాతృభాషలో ఉండడం మంచిదే కానీ, ఎవరు పట్టించుకుంటున్నారు కనుక?.. గ్రామస్థాయి నుంచి పరిపాలన తెలుగులోనే సాగాలన్న ప్రతిపాదనలు ఏళ్ళతరబడిగా అవన్నీ కేవలం కాగితాల కవిలెకట్టలుగానే ఉంటున్నాయి. న్యాయస్థానాల్లోనూ మాతృభాషల్లోనే తీర్పులు ఇస్తే అందరికీ అర్థమవుతాయనే ఆలోచనలు భేషుగ్గానే ఉంటున్నాయి కానీ, అవి కూడా నేటికీ ఒక కొలిక్కి రావడం లేదు. వాడకుంటే భాష వాడిపోతుందని, మాట్లాడకుంటే ఆ భాష కనుమరుగైపోతుందని నిపుణులు చెప్తున్న నేపథ్యంలో, అమృతం లాంటి మన తెలుగుభాష..మృతభాష కాకుండా చూసుకోవాల్సిన తక్షణ కర్తవ్యం అందరిదీ!..

రానురాను ప్రపంచంలో కొన్ని భాషలు అంతరించిపోతున్నాయని, ప్రపంచంలోని సుమారు 6వేల భాషల్లో సగానికిపైగానే అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని గుర్తించిన 'యునెస్కో' సంస్థ' మాతృభాషలను పరిరక్షించుకునేందుకు ప్రతిఏటా ఫిబ్రవరి 21వ తేదీని 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం'గా ప్రకటించింది. ఏ భాషకు చెందినవారైనా 30 శాతం, తమ మాతృభాషలో మాట్లాడుకునేందుకు, వ్యవహరించుకునేందుకు దూరమైపోతే ఆ భాషలు అంతరించిపోయే జాబితాలో పడినట్లే. అందువల్ల మాతృభాషల పరిరక్షణ ఇప్పుడు అత్యంత ఆవశ్యకమైంది. మాతృభాషను సదా రక్షించుకుంటూ, అమృతతుల్యమైన మన మాతృభాష మృతభాష కాకుండా కాపాడుకోవాలి. ఇది ప్రతి ఒక్కరి పవిత్ర కర్తవ్యం. ఇటీవల పాఠశాలల్లోని బాలబాలికలు తెలుగులో చదవడం, రాయడం కూడా మరచిపోతున్నారని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇదెంతో ఆందోళనకరమైన విషయం. పిల్లలు మాతృభాషను మరచిపోకుండా తల్లిదండ్రులు, గురువులు బాధ్యత తీసుకోవాలి. తెలుగు భాషాభిమానులు, ఉపాధ్యాయులు, రచయితలు, కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు అందరూ మాతృభాషకు, తెలుగుభాషా సాహిత్యాల వికాసానికి నిరంతరం కృషిచేస్తూనే ఉండాలి. ప్రభుత్వాలు, పాలకులు అందుకు చేయూతనందించాలి. అందరం కలసి భాషను కాపాడుకున్నప్పుడే అందరికీ గౌరవం. అప్పుడే... మాతృభాషా దినోత్సవాలకు కూడా సార్థకత చేకూరుతుంది.

# 'ర్యాగింగ్' భూతంతో జాగ్రత్త!



జిల్లాలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటివి ఇటీవలి కాలంలో కనుమరుగైపోయాయని అనుకుంటున్న తరుణంలో, కావలి రైల్వేస్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై అనంతసాగరం మండలానికి చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పదమృతికి కారణం ర్యాగింగేనని, తమ బిడ్డ ర్యాగింగ్ వేధింపులతోనే చనిపోయాడని తల్లిదండ్రులు ఆవేదనతో ఆరోపించడంతో..'ర్యాగింగ్' మాట మళ్ళీ జిల్లాను బెంబేలెత్తిస్తోంది. ఈ ర్యాగింగ్ రాకాసికి వెంటనే అడ్డుకట్ట వేయకపోతే ఇది మరింతగా కోరలు సాచి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తుందని అందరూ ఆందోళన చెందుతున్నారు.

పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం అన్నట్లుగా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటివి కళాశాలల్లో కొందరు విద్యార్థులకు ఆటగా, మరికొందరికి చేటుగా తయారవుతున్నాయి. ఇతర విద్యార్థులను కూడా ఈ అకృత్యాలు భయభ్రాంతులకు గురిచేస్తుంటాయి. కొందరు విద్యార్థుల వికృత మనస్తత్వానికి ర్యాగింగ్ పరాకాష్ట వంటిది. గతంలో రాష్ట్రంలోని పలు కళాశాలల్లో ర్యాగింగ్‌లు నిత్యకృత్యంగా ఉండేవి. కొత్తగా చేరిన విద్యార్థులను సీనియర్‌లు ఆటపట్టించడం వంటివి సరదాగా ప్రారంభమై, చివరికి అవి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే దశకు చేరుకున్నాయి. ర్యాగింగ్ చేయడంతో పాటు అసభ్యప్రవర్తన, హింస వగైరాలన్నీ చోటు చేసుకోవడంతో ర్యాగింగ్ భయంకర నేరంగా మారింది. అమాయకులైన విద్యార్థుల ప్రాణాలు తీసే ఈ ర్యాగింగ్‌ను నిరోధించడానికి అధికారులు, పోలీసులు గతంలో ఎన్నో పటిష్టమైన చర్యలు తీసుకోవడం కూడా జరిగింది. ప్రత్యేకించి విద్యార్థులకు ర్యాగింగ్ నేరమనే విషయాన్ని తెలియపరుస్తూ, ర్యాగింగ్ చేసినట్లు తెలిస్తే తాటతీస్తామని చెప్పేవారు. దురుసుగా ప్రవర్తించే ఆకతాయిల ఆటలు కట్టించేందుకు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కలిగించడం, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడుతున్న వారిని కఠినంగా

## సమస్యల తో 'రణం'

శిక్షిస్తుండడంతో క్రమేణా ర్యాగింగ్‌కు పాల్పడాలన్న ఆలోచనలకు అందరూ దూరమవుతూ వచ్చారు. అయితే, తాజాగా కావలి ఉదంతంతో మళ్ళీ ర్యాగింగ్ అనేమాట జిల్లాను బెంబేలెత్తిస్తోంది. దీంతో, కళాశాలల్లో అసలేం జరుగుతుందోనని తల్లిదండ్రులు లోలోపలే ఆందోళన చెందుతున్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

సెల్‌ఫోన్లు చేతిలోకి వచ్చాక, యువతలో వికృతచేష్టలు పెరిగిపోతున్నాయి. ఆ ఫోన్లు ఇస్తే ఒక బాధ, ఇవ్వకుంటే ఒక బాధ!. గంటల తరబడి ఫోన్ల మాయాజాలంలో పడిపోతున్నారు. పాశ్చాత్య విష సంస్కృతి ప్రభావం వారిని రకరకాల వ్యసనాలకు, లైంగిక దాడులకు, మత్తుపదార్థాల వైపుకు, హింసాత్మక చర్యలకు పురికొల్పుతోంది. ఫోన్లను ఏ విజ్ఞానానికో, లేదా విద్యకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకో వినియోగించుకుంటామని తల్లిదండ్రులకు చెప్తారే తప్ప, ఆ తర్వాత వారి లోకం వారిదే అయిపోతోంది. ఒకరకంగా చెప్పాలంటే స్మార్ట్‌ఫోన్ లేకుండా అరక్షణం కూడా గడవదన్నట్లుగా తయారైంది పరిస్థితి. ఈ నేపథ్యంలో వారు ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వారు పెడదారి పట్టకుండా చూసుకోవాల్సిన కర్తవ్యం కూడా వారిదే. తమ బిడ్డలు నేరాల జోలికి పోకుండా కాపాడుకోవాలి. ముఖ్యంగా, ర్యాగింగ్ వంటి నేరాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, గురువులు బాగా అవగాహన కలిగించాలి. అంతేకాదు, విద్యార్థుల ప్రవర్తనను అధ్యాపకులు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. ర్యాగింగ్ భూతం పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా ర్యాగింగ్ భూతం మరింత జడలువిప్పి వీరంగం చేస్తుంది. అందుకే, ఆ రాకాసిని నియంత్రించేందుకు 1997లోనే ప్రభుత్వం ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని కూడా తెచ్చి ర్యాగింగ్‌పై కొరడా ఝుళిపించింది. ర్యాగింగ్ నిరోధానికి సుప్రీం కోర్టు కూడా దృష్టిపెట్టింది. దీంతో ర్యాగింగ్ రాకాసి కోరలు పెరికేసినట్లయింది. రాష్ట్రంలో ర్యాగింగ్ అంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఏదేమైనా, ర్యాగింగ్ ఎక్కడా జరగకుండా ఎవరికి వారు ఎల్లవేళలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు, యువత ర్యాగింగ్ వంటి నేరాలకు దూరంగా ఉండాలి. ఏ చర్య ద్వారానైనా ఒక విద్యార్థికి అవమానం లేదా భయం కలగడం, అవహేళనకు గురైనందువల్ల గౌరవానికి భంగం కలగడం, మానసికంగా, శారీరకంగా గాయపరచడం వంటివి నేరం కింద పరిగణిస్తారు. కళాశాలల్లోనూ, బయట ప్రాంతాల్లోనూ ర్యాగింగ్ జరపడం నేరం. ర్యాగింగ్ చేయాలనే ఉద్దేశ్యంతోగానీ, లేదా ర్యాగింగ్ జరుగుతుందని తెలిసి ర్యాగింగ్‌కు సహకరించడం, ర్యాగింగ్ చేయడానికి ఇతరులను రెచ్చగొట్టడం వంటివన్నీ నేరాలే. ర్యాగింగ్ పేరుతో జరిగే రకరకాల హింసలకు చట్టంలో అనేక కఠినమైన శిక్షలున్నాయి. ర్యాగింగ్‌తో ఎవరైనా మరణించారో..అదింకా పెద్ద నేరం. సంబంధిత నేరస్తులకు జీవితఖైదు, లేదా పదేళ్ళపాటు జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉంటుంది. కాబట్టి విద్యార్థులు ఈ విషయాల పట్ల అవగాహనతో అప్రమత్తంగా ఉంటూ, ర్యాగింగ్ వంటి వాటి జోలికి వెళ్ళకుండా, బాగా చదువుకుని తమకు, తల్లిదండ్రులకు, చదువుచెప్తున్న కళాశాలలకు కూడా మంచిపేరు తీసుకురావాలి. కళాశాలలకు వెళ్ళినప్పుడు చెడు స్నేహితుల ప్రభావంలోపడితే అంతే సంగతులు!..ఒళ్లు దగ్గరపెట్టుకుని ప్రవర్తించకపోతే ఆ తర్వాత విచారించి ప్రయోజనం ఉండదు. తస్మాత్ జాగ్రత్త!....

- సంచారి

# దొంగలు, దోపిడిగాళ్ళ నుంచి కాపాడాలి

నెల్లూరు నగరంలో గత కొద్దిరోజులుగా దొంగతనాలు, దోపిడీలు పెరిగిపోతున్నాయి. ఎప్పుడు ఎవరింటిమీదికి దొంగలు వస్తారో, ఎవరింటిని దోపిడీ చేస్తారోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గతంలో ఏ రాత్రిపూటో సైగ్గా దొంగతనాలు జరుగుతుండేవి. ఇప్పుడు పట్టపగలే, పబ్లిగ్గా నేరుగా ఇళ్ళలోకి వచ్చి దొంగలు కత్తులతో బెదిరించి ఉన్న సొమ్మును లాక్కుపోతున్నారు. ఇంత బరితెగింపు ఇప్పుడే చూస్తున్నాం. అయినా, ఈ చోరీలకు, అఘాయిత్యాలకు అంతే లేదా?.. పగలు రాత్రి తేడాలేకుండా నగరంలో దొంగలు ప్రజల్ని హడలెత్తిస్తున్నారు. ఏదైనా ఊరికో, లేదా ఏ పనిమీదైనా ఇళ్లకు తాళం వేసి, తిరిగి వచ్చేసరికి ఇల్లంతా దొంగలు గుల్ల చేసేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత ఘోరాలు లేవు. ఇళ్ళ తాళాలు తలుపులు పగలగొట్టి ఉన్నదంతా దోచుకుపోతున్నారు. జిల్లాలో ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఈ తరహా దొంగతనాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఎంత కాలం ఇలా?..జిల్లా పోలీసు ఉన్నతాధికారులకే సవాల్‌గా ఉంటున్నాయి ఈ దొంగతనాలు. ఎన్ని దొంగతనాలు జరుగుతున్నా, పోలీసులు దర్యాప్తులకు, క్లూస్‌టీమ్‌లకు కూడా చిక్కకుండా దొంగలు తమ పనిని తాము నిరాఘాటంగా కానిచ్చేస్తున్నారు. గత అయిదారు నెలలుగా జిల్లాలో దొంగతనాలు మరీ జోరందుకున్నాయి. వార్తాపత్రికల్లో తరచూ ఆ చోరీల గురించిన వార్తలే. పోలీసు యంత్రాంగానికి నిఘా కెమెరాలు, ఆధునిక సాంకేతిక విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటికి కూడా దొరకకుండా ఇంతకాలంగా నిర్భయంగా దొంగలు దొంగతనాలు చేస్తున్నారంటే ఏమనుకోవాలి?..ఏదేమైనా, ఈ దొంగతనాలతో జిల్లా ప్రజలు, నగర ప్రజలకు రాత్రివేళల్లో కంటికి కునుకుండడం లేదు. ఇకనైనా జిల్లా పోలీసు యంత్రాంగం ఈ దొంగతనాలపై దృష్టిపెట్టి, దొంగల ఆట కట్టించాలని ప్రార్థన.

కె.ఆర్.మస్తానయ్య, ఏసీనగర్.




# పేద విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దు

పాఠశాలల విలీనం పేరుతో రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పేదపిల్లలు విద్యకు దూరమవుతారు. ఆయా గ్రామాల్లో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుకునే చిన్నపిల్లలకు అందుబాటులో ఉండే ప్రాథమిక విద్యాశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ఎంతమాత్రం సముచితం కాదు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా, రాష్ట్రంలో వందలాది పాఠశాలలను ఇలా విలీనం చేసేస్తుండడం దారుణం. విలీనం కోసం ఆయా పాఠశాల్లో ఉపాధ్యాయులను నియమించకుండా ఉండడం మరింత ఘోరం. ఇలా చేయడం వల్ల పేద విద్యార్థులు, దూరాభారం ఉండే ఉన్నతపాఠశాలలకు వెళ్ళలేని వారు ఎంతోమంది విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ఈ వాస్తవ పరిస్థితులను గమనించి ప్రజాశ్రేయస్సు దృష్ట్యా మరొకసారి పరిశీలించి ఈ విలీనం ప్రతిపాదనలను విరమించుకుని పేద విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి.

ఎంఎస్‌వి గంగాధర్‌రావు, పొదలకూరు.

## ఆత్మీయ కలయిక



తనను టిటిడి ధార్మిక సలహాదారుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలియజేసిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇటీవల తన క్యాంపు కార్యాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహుకరించి సత్కరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చాగంటి కోటేశ్వరరావు వెంట శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో గోశాలను చాగంటి, వరప్రసాద్‌రెడ్డిలు సందర్శించి సిఎం జగన్‌ను ప్రశంసించారు.

# ఉపాధ్యాయులతో.. పర్వతరెడ్డి సమావేశం



ఇటీవల ఒంగోలులో జరిగిన 36 ప్రభుత్వ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల వారి ఆత్మీయ సమావేశంలో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చంద్రశేఖర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చంద్రశేఖర్‌రెడ్డి లాంటి సేవభావం కలిగిన వ్యక్తి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుండడం సంతోషంగా ఉందని, ఆయన గెలుపు తధ్యమని వారు పేర్కొన్నారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, 36 ప్రభుత్వ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు తన వెంట నిలవడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్సీ కాకుండానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించేందుకు కృషి చేసి కొన్నింటిలో విజయం సాధించానన్నారు. మరికొన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి తనకందిస్తున్న సహకారాన్ని ఎన్నటికీ మరువలేనని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చంద్రశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు.

# సామాజిక న్యాయానికే ముఖ్యమంత్రి ప్రాధాన్యత

## కొనియాడిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులలో మొత్తం 18 స్థానాలకు గాను, బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు1 స్థానాన్ని ముఖ్యమంత్రి కేటాయించారని, దేశంలో సోషల్ ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు కొనియాడారు. సామాజిక అసమానతలు లేకుండా చేయడమే తన లక్ష్యం అంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు రాజకీయంగానూ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నని ఆయన ప్రస్తుతించారు. ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సామాజిక న్యాయాన్ని పాటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు ఎప్పుడూ అండగా ఉంటానని మరోసారి నిరూపించారని పేర్కొన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల్లో 14 మంది అభ్యర్థుల స్థానాలను బడుగు బలహీనవర్గాల వారికే కేటాయించారంటే, సీఎం వైయస్ జగన్ మోహన్‌రెడ్డికి వారిపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల అభ్యర్థుల కోటా కింద ఎమ్మెల్సీగా నిర్ణయించబడిన మేరిగ మురళీధర్‌కు ఆయన శుభాభినందనలు తెలియజేశారు.

### నాణ్యమైన విద్య కోసమే...

# నూతన జాతీయ విద్యావిధానం




పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకే కేంద్రప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సభ్యులు ప్రొఫెసర్ శివరాజ్ అన్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ రాష్ట్రస్థాయి మహాసభలు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ప్రొఫెసర్ శివరాజ్ సభనుద్దేశించి మాట్లాడుతూ, కొత్త విద్యావిధానం వల్ల ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతాయని చెప్పారు. భారతదేశంలోని గురువులు ఒకప్పుడు విద్యార్థులను దేశభక్తులుగా తీర్చిదిద్దడంతోపాటు ఉన్నతమైన విలువలు కూడా నేర్పేవారని, అయితే ప్రస్తుతం విదేశీ ఆచారాలు సంప్రదాయాలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాన వక్త గుంతా లక్ష్మణ్ ఆవేదన వ్యక్తంచేశారు. మహాసంఘ్ దేశ కీర్తిప్రతిష్టలు పెరిగేలా అంతర్జాతీయ సంస్థలకు నాయకత్వం వహించేలా విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నారాయణ లాల్ గుప్తా గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్య విధానాన్నే ఏపీ ప్రభుత్వం అమలుచేస్తోందని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి చెప్పారు. మహాసంఘ్ నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ రాజశేఖర్ ఈ సభలను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో, ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తితోనే.. భగవంతుని అనుగ్రహం

## ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

భగవద్భక్తితోనే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 22న స్థానిక భరధ్వాజ రుద్రాభిషేకం సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సతారా (ఉత్తర చిదంబరక్షేత్రం) వైభవం'పై ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. భక్తులు ఆర్తితో భగవంతుణ్ణి వేడుకుంటే, ఏదో ఒక రూపంలో ఆ భగవంతుని అనుగ్రహం కలుగుతుందని ఆయన అన్నారు. ప్రజలు ఆ భగవంతునిపై భక్తితో జీవించాలని, ఆ పరమాత్మ అనుగ్రహం కోసం ప్రార్థించాలని, పిల్లలకు దైవభక్తితో పాటు దేశభక్తిని కూడా బోధించాలని తెలిపారు. ప్రపంచంలోనే హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. మహారాష్ట్రలోని సతారా నగరం, సతారా పర్వతశ్రేణులు ఎంతో విశిష్టమైనవని, వాటి ప్రాశస్త్యాన్ని ఆయన ఈ సందర్భంగా అత్యద్భుతంగా వివరించారు. భరద్వాజ రుద్రాభిషేక సంఘం అధ్యక్షుడు ధనుంజయ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి



మా ఇంటి దీపం, మా పెద్దదిక్కు
శ్రీమతి నాగులపాటి హాజరత్తమ్మ గారు
(లేట్ 'రెడ్డి & రెడ్డి' వరదారెడ్డి గారి సతీమణి)
ఫిబ్రవరి 14, 2023న పరమపదించారు.
పెద్దకర్మ
ఫిబ్రవరి 26, 2023, ఆదివారం ఉదయం 12.30 గంటలకు ఇందు విల్లాస్ క్లబ్‌హౌస్, ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్, 13వ ఫేస్, కెపిహెచ్‌బి, హైదరాబాదు నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.
అమ్మ పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
కుమారుడు మరియు కుమార్తెలు



సంవత్సరీకము



శ్రీమతి బయ్యా సరోజనమ్మ గారు
(కీ.శే. బయ్యా వెంకట రమణయ్య గారి ధర్మపత్ని)
సంవత్సరీకము (యేడూడి తిధులు)

అమ్మ
కడుపులో దాచుకుంటుంది
కనురెప్పలా కాచుకుంటుంది
అన్నివేళలా ప్రక్కనుండి
నేనున్నాననే అభయమిస్తుంది
మా ప్రతీ ఆలోచనలో... ప్రతీ అడుగులో...
ప్రతీ విజయంలో...
నీడలా అనుసరిస్తూనే ఉంటుంది
ఈరోజు మాతో అమ్మ లేదన్నది అబద్ధం!
మా ఊపిరి ఉన్నంతవరకు అమ్మ సజీవమే!!

పంక్తి :
ది. 26-2-2023 ఆదివారం మ || 12 గం. లకు
శ్రీ పాండురంగ కళ్యాణ మండపం,
రంగనాయకులపేట, నెల్లూరు.

ఇట్లు – కుమారులు
బయ్యా శ్రీనివాసులు
బయ్యా వెంకట రవికుమార్

న్యూ రాజ్యలక్ష్మి హాల్
శుభమస్తు షాపింగ్ మాల్ ఆంధ్రప్రదేశ్

# పెద్దాసుపత్రిలో వైద్యసేవలు బాగుండాలి

### --- కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ---

నెల్లూరు పెద్దాసుపత్రిలో వైద్యసేవలు బాగుండాలని, అక్కడకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలని, ఆసుపత్రి వైద్యులు రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ స్థానిక పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పెద్దాసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల వివరాలను సమీక్షించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి కో-ఆర్డినేటర్ లక్ష్మీసునంద, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, కమిటీ సభ్యులు అభిషేక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషను కాపాడుకోవాలి

### విఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి



మాతృభాషను ఎవరూ విస్మరించరాదని, అమ్మభాషను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి అన్నారు. వెంకటాచలం మండలంలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఇటీవల జరిగిన మాతృభాష దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని తెలుగుభాష ఔన్నత్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌మణిపాల్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్ శివరామప్రసాద్, డాక్టర్ మాల కొండయ్య, డాక్టర్ దివ్య, డాక్టర్ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..

# వెండి పూజాసామగ్రి

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవాలయానికి మల్లేశ్వరశర్మ-పద్మజ దంపతులు ఇటీవల వెండిపూజా సామగ్రిని సమర్పించుకున్నారు. వెండి వింజామరలు, వెండిపళ్ళెం, నివేదన పాత్రలను వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి సన్నిధి వద్ద దాతలతో ప్రత్యేకపూజలు చేయించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరామ్, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

### - పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని, జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అందరూ ఆ దిశలో కృషిచేసి పార్టీని పటిష్టం చేయాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పిసిసి అధ్యక్షులుగా ఆయన పదవిని చేపట్టాక, తొలిసారిగా ఈనెల 21న ఆయన నెల్లూరుకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మెన్, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఇందిరాభవన్లో జయప్రదంగా జరిగిన 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' సమీక్ష సమావేశాల్లో ఆయన పాల్గొని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాహుల్‌గాంధీ 'భారత్‌జోడో' యాత్రను చేపట్టి దేశంలోని అనేకప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారని, ఆ స్ఫూర్తితో పాదయాత్రకు కొనసాగింపుగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఏఐసిసి కార్యదర్శి మెయప్పన్, జనరల్ సెక్రటరీ మస్తాన్‌వలీ, డిసిసి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామ్‌భూపాల్‌రెడ్డి, రంగస్వామి, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 42వ సారి రక్తదానం



నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, రక్తదాత దాసరి రాజేంద్రప్రసాద్ ఈనెల 20న 42వ సారి రక్తదానం చేసి తన సేవాభావం చాటుకున్నారు. రక్తదానం ద్వారా బాధితులకు ప్రాణం పోయవచ్చని, ఒకసారి రక్తదానంతో మరో ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ కార్యదర్శి పి.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

# గెలుపే లక్ష్యంగా కృషిచేయాలి



### ● పార్టీ శ్రేణులకు వైకాపా నేతల దిశానిర్దేశం

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైకాపా నేతలు పార్టీవర్గాలకు పిలుపునిచ్చారు. ఈనెల 21న నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన విషయాలను నాయకులు చర్చించారు. వైకాపా జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ..రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైకాపా రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తితో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న వైకాపా అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవినధిష్టించినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజల సంక్షేమమమే ధ్యేయంగా కృషిచేస్తున్నారని, రాజ్యాధికారంలో బడుగు బలహీనవర్గాల వారికి పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి రాష్ట్రముఖ్యమంత్రి ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నారని నాయకులు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కల్పించారని, 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ముఖ్యమంత్రి విద్యారంగానికి ఎనలేని సేవలందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలని, ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించేలా అందరూ కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు మేరిగ మురళి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'విశ్వసాయి ఎస్ఆర్‌కె'లో.. ఉత్సాహంగా 'సీజన్స్ డే'

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి ఎస్ఆర్‌కె స్కూల్లో ఇటీవల సీజన్స్‌డేని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. అన్ని కాలాల్లో వచ్చే మార్పులను, ఆయా సీజన్‌లలో పండే పంటలు, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. రుతువుల్లో మార్పులు, లభించే ఆహారపదార్థాలు, ధరించాల్సిన దుస్తులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విశ్వసాయి విద్యాసంస్థల డైరెక్టర్ జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం, విద్యార్థుల తల్లిదండ్రులకు పలు పోటీలు పెట్టి విజేతలకు బహుమతులందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

# 25న..జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఫిబ్రవరి 25వ తేదీన నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నామని, ఆయా కమిటీల సభ్యులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరుకావాలని జడ్పీ సిఇఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఆర్థికపరమైన అంశాలకు తావివ్వకుండా సమావేశాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మహాశివరాత్రి విశిష్టత

### శివపార్వతుల కళ్యాణం

మహాభారతంలో పరమేశ్వరుని ప్రస్తావన చాలాసార్లు వస్తుంది. అర్జునుడు శివుణ్ణి గురించి తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని సంపాదిస్తాడు. మనం ఈ వారం శివరాత్రి సందర్భంగా శివుణ్ణి గురించి చెప్పుకుందాం. అసలు శివరాత్రికి, మహాశివరాత్రికి తేడా ఏమిటంటే, ప్రతినెలా కృష్ణచతుర్దశి నాడు జరుపుకునేది శివరాత్రి. అదే సంవత్సరానికి మాఘ మాసంలో వచ్చే శివరాత్రిని మహాశివరాత్రి అంటారు. శివపార్వతుల పెళ్లిరోజే మహాశివరాత్రి. హిమవంత పర్వతరాజు కూతురు పార్వతి. ఆమెకు శివుడంటే అమితమైన ఇష్టం. నారదుని సలహా మీద పార్వతి




కైలాసం వచ్చి శివుణ్ణి ఆరాధిస్తుంది. కానీ శివుడు పార్వతికి పరీక్ష పెట్టాలని, ఒక మహర్షి రూపంలో వచ్చి, శివుడు మోసగాడని, అతన్ని నమ్మవద్దని చెప్తాడు. పార్వతి అతని మాటలు పెడచెవినపెట్టి, ఆ మహర్షిని కోపగించుకుంటుంది. అప్పుడు శివుడు మెచ్చి వివాహం చేసుకుంటానని చెపుతాడు.

శివపార్వతుల వివాహం అత్యంత వైభంగా అందరి దేవతల సమక్షంలో జరుగుతుంది. ఆ రోజుని మహాశివరాత్రిగా జరుపుకుంటాం.






భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.

# కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో..రిటైల్ మెగా ఎక్స్‌పో

### ● వివిధ రుణపథకాలపై ప్రజలకు అవగాహన



కెనరాబ్యాంక్ రీజనల్ కార్యాలయం-రిటైల్ అసెట్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న నెల్లూరులో రిటైల్ లోన్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించి, బ్యాంకు అందిస్తున్న పలు రుణపథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. హుండాయి, హోండా, మారుతి, కియో, స్కోడా తదితర ప్రధాన కార్ల డీలర్లు తమ వాహనాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఖాతాదారులు, ప్రజల సౌకర్యార్థం కెనరా బ్యాంక్ ప్రముఖ డీలర్లతో ఒకేచోట ఈ ఎక్స్‌పోను నిర్వహించడం విశేషం. బ్యాంక్ రీజనల్ హెడ్ శ్రీనివాసకన్నన్, రిటైల్ అసెట్ హబ్ డివిజనల్ మేనేజర్ ఎల్.కృష్ణకుమార్‌లు ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. రిటైల్ లోన్ ఎక్స్‌పో సందర్భంగా 7.60 కోట్ల రూపాయల మేరకు రుణాలను మంజూరు చేశారు. 1.45 కోట్ల రూపాయలను తక్షణ రుణాలుగా పంపిణీ చేశారు. ఖాతాదారులు, ప్రజలు ఇలాంటి రుణమేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ వీరేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కెనరాబ్యాంక్ రుణ పథకాలను సమగ్రంగా వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

## సంగీత సాహిత్యాలతో పులకించిన.. శ్రీసిటీ 'శ్రీవాణి' వేదిక




## మధుర మనోజ్ఞంగా సాగిన..

# యాచేంద్ర 'సంగీత గేయధార'

ప్రముఖ సారస్వతవేత్త, గాయకులు, వెంకటగిరి రాజా..శ్రీ వెంకటేశ్వర భక్తి చానెల్ (ఎస్వీబిసి) ఛైర్మెన్ డా. వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర 'సంగీత గేయధార' కార్యక్రమం ఈనెల 18న శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహితీ వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఎంతో వీనుల విందుగా జరిగింది. భావసౌందర్యం, గాన మాధుర్యం జట్టు కడుతూ, సంగీత సాహిత్యాలు చెట్టా పట్టాలు వేసుకుంటూ మనోహరంగా సాగిన 'సంగీత గేయధార', రసజ్ఞులను, సాహితీప్రియులను అలరించింది. ఇది సాయికృష్ణ యాచేంద్ర నిర్వహించిన 403వ గేయధార. ఈ సందర్భంగా డా.యాచేంద్రతో పాటు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. సమన్వయ కర్తగా కందనూరు మధు(చెన్నై) వ్యవహరించగా, పృచ్ఛకులుగా పాల్గొన్న శోభా రాజా, కుసుమకుమారి, పణతుల సుబ్రహ్మణ్యం, జేకే రెడ్డి, వెంకటరామజోగి, కామేశ్వరరావులను శ్రీసిటీ ప్రతినిధి పల్లేటి బాలాజీ సభకు పరిచయం చేశారు. సంగీత సాహిత్య ప్రధానంగా సాగిన ఈ కార్యక్రమం అష్టావధానం లాంటి ప్రక్రియ. పృచ్ఛకుల సూచనలకు అనుగుణంగా గేయ అవధాని డా. యాచేంద్ర అప్పటికప్పుడే ఆశువుగా రాగతాళ యుక్తంగా గేయాలను ఆలపించి అందరి ప్రశంసలందుకున్నారు. ముఖ్యంగా ఈ మహాశివరాత్రి సందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతుల వైశిష్ట్యాన్ని, అర్ధనారీశ్వర తత్వాన్ని డా. యాచేంద్ర అత్యద్భుతంగా తమ గేయధారలో వివరించారు. మధ్య మధ్యలో జేకే రెడ్డి ప్రస్తావించిన మంచి ముచ్చట్లు రక్తి కట్టించాయి. శ్రీసిటీ సృష్టికర్త రవీంద్ర సన్నారెడ్డి సాధించిన విజయాన్ని మెచ్చుకుంటూ, ఆయన తండ్రి ఇచ్చే అశీస్సులను గేయ రూపంలో గానం చేయమని, 'మానవుడే మహనీయుడు' అన్న పల్లవిని వెంకట రామజోగి సూచించగా, వేలమందికి ఉపాధిని కల్పిస్తూ ఆధునిక దేవాలయంగా పిలువబడుతున్న శ్రీసిటీని కీర్తిస్తూ యాచేంద్ర ఒక మనోహర గేయాన్ని ఆలపించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. చివర్లో, తరిగొండ వెంగమాంబ రచించిన లాలిపాటను ఆయన గానం చేశారు.

## శ్రీసిటీలో.. చేనేత-జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వ చేనేత మరియు జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ (ఆపరేషన్స్) ఆమెకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని, అక్కడ ఏర్పాటైన వస్త్ర పరిశ్రమల విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీలో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా సురక్షితమైన వాతావరణంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తున్న తీరును ప్రశంసించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు జెన్ లెనిన్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ తదితర పరిశ్రమలను ఆమె సందర్శించారు. ఆయా పరిశ్రమలలో తయారవుతున్న వస్త్ర ఉత్పత్తులతో పాటు కార్మికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆమె పర్యటనను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. తరచూ ప్రభుత్వ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక అభివృద్ధికి సహకరించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ లభించింది. ఈ కళాశాలలో ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.లక్ష్మణ్‌రావు 'ఏ రోబస్ట్ వెవలెట్ బేస్డ్ ఇమేజ్ వాటర్ మార్కింగ్ ఫర్ కాపీరైట్ ప్రొటెక్షన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు సవీత డీమ్డ్ టు బి యూనివర్శిటీ-చెన్నై వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ ఏ.నారాయణ తదితరులు ఆయనను అభినందించారు.




## మాతృదేవోభవ

మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
28 ఏళ్ళు నిండనున్న సందర్భంగా
**ఆమె ఆత్మశాంతికై**
**భగవంతుని ప్రార్థిస్తూ...**

ఆమె ఆత్మీయులైన వారందరికీ
**మా మాతృదేవత**
**ఆశీస్సులు కోరుకుంటూ...**



నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ

**స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ**

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

**డా॥ టి.సుబ్బరామిరెడ్డి**
మాజీ రాజ్యసభ సభ్యులు
మరియు
**వారి కుటుంబసభ్యులు**

### వెంకయ్యనాయుడు చొరవతో..

# 'సింహపురి వాణి'గా..'నెల్లూరు ఆకాశవాణి'

## ● 5వ వసంతంలోకి అడుగిడిన రేడియో కేంద్రం




భారత పూర్వ ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో నెల్లూరులో నాలుగేళ్ళ క్రితం.. 2019 ఫిబ్రవరి 21వ తేదీన ఆకాశవాణి రేడియో కేంద్రం ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 21కి నాలుగేళ్ళ పూర్తయి, 5వ వసంతంలోకి అడుగిడడం విశేషం. కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిగా ఉన్నప్పుడు, మన సింహపురి ముద్దుబిడ్డ వెంకయ్యనాయుడు నెల్లూరు సంస్కృతికి ప్రతీకగా రేడియో కేంద్రాన్ని నెలకొల్పేందుకు కృషి చేశారు. 'సింహపురి ఎఫ్‌ఎం రేడియో స్టేషన్'గా ఈ కేంద్రం బాగా అభివృద్ధి చెందుతోంది కూడా. కరోనా సమయంలోనూ, ఇటీవల జిల్లాలో సంభవించిన వరదల సమయంలో ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తూ నెల్లూరు రేడియో పోషించిన పాత్ర మరువలేనిది. జిల్లా అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని అందిపుచ్చుకుని వరదల సమయంలో తగు హెచ్చరికలను అందించింది. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలతో ప్రసంగాలు, కవిసమ్మేళనాలతో పాటు, నెల్లూరు సంస్కృతిని చాటిచెప్పేవిధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగల ప్రాధాన్యతలను, విశేషాలను తెలియజెప్తోంది. ప్రతిరోజూ ఉదయం 5.48 నుంచి, రాత్రి 11.11 గంటల వరకూ ఈ కేంద్రం నుంచి ప్రసారాలు కొనసాగుతున్నాయి. సింహపురి ప్రజల మనసులను ఆకట్టుకునేవిధంగా ఎన్నో రకాల కార్యక్రమాలు ఈ రేడియో కేంద్రం నుంచి ప్రసారమవుతుండడం విశేషం.

## ఔత్సాహికులకు అవకాశం

బాలబాలికల్లో శాస్త్రీయ సంగీతం పట్ల ఆసక్తి కల్పించాలనే సంకల్పంతో ఆకాశవాణి సింహపురి ఎఫ్‌ఎం కేంద్రం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ ఏ.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కర్నాటక, హిందుస్థానీ సంగీతం అభ్యసిస్తున్న 16 సంవత్సరాలలోపు బాలబాలికలు తమ సంగీతం వివరాలు (గాత్రం విభాగంలో కీర్తనలు, హరికథ, బుర్రకథ మొదలైనవి), వాద్యాలలో వీణ, వయోలిన్, తంబుర మొదలైనవి తెలపాలని కోరారు. ఆసక్తికలవారు పేరు, పుట్టినతేదీ, చిరునామా, సెల్‌నెంబరు, విద్యార్హతతోపాటు వారు అభ్యసిస్తున్న అంశంపై 5నిమిషాలకు మించకుండా రికార్డ్‌చేసి మెయిల్ (fmradionellore@gmail.com) చేయాలని పేర్కొన్నారు. వాటిలో ప్రసార యోగ్యత కలవాటిని ఎంపికచేస్తామని, ఎంపికైనవారు రికార్డింగ్ కోసం ఆకాశవాణి కేంద్రానికి రావాల్సి ఉంటుందని తెలిపారు.





### ప్రజల హృదయాల్లో...

# పెద్దాయన స్థానం పదిలం

● జనార్ధన్‌రెడ్డి జయంతిలో నాయకులు
● రక్తదానం చేసిన తనయుడు రామ్‌కుమార్‌రెడ్డి

స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, జిల్లా నేతగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాక, కేంద్రంలోనూ ఎంతో పేరు ప్రతిష్ట లార్జించిన నాయకునిగా దేశవ్యాప్తంగా ఆయన ప్రఖ్యాతిపొందారని పలువురు నాయకులు కొనియాడారు. ఈనెల 20న మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత.. స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 88వ జయంతి వేడుకలు కోట మండలంలోని విద్యానగర్‌లో ఎంతో కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు జనార్ధన్‌రెడ్డి ప్రజలకు చేసిన అమూల్యమైన సేవలను స్మరించుకున్నారు. నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో జరిగిన ఈ వేడుకల్లో నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల అధినేత, నేదురుమల్లి కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈసారి కూడా పెద్దఎత్తున అభిమానులు, విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి నేదురుమల్లి పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా అభివృద్ధికి నేదురుమల్లి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. తొలుత, రక్తదాన శిబిరాన్ని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది 155 యూనిట్ల రక్తాన్ని, గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది మరో 45 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రామ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన అభిమానులు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తంగా 275 యూనిట్లు రక్తదానం చేశారు. స్థానిక నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, నాగూర్‌రెడ్డి, ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ఇందిరాభవన్‌లో నేదురుమల్లికి నివాళి



నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఈనెల 20న స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, నగరాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, కిసాన్ సెల్ అధ్యక్షులు వి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్స్ సెల్ ఛైర్మెన్ సి.శ్రీధర్‌రెడ్డి, ముదిగొండ శ్రీనివాసులు, ఎస్సీసెల్ అధ్యక్షులు కె.పవన్‌కుమార్, మైనార్టీసెల్ అధ్యక్షులు అల్లాఉద్దీన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లతారెడ్డితో పాటు నాయకులు మోహన్‌రెడ్డి, రమేష్‌బాబు, ఎస్‌కె హుస్సేన్‌బాషా, లక్ష్మీనారాయణ, రాజేష్, మల్లి, రూబెన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు.



### 'సుందరకాండ పారాయణం'..

# ఆడియో సీడీ ఆవిష్కరణ

ఆదికవి వాల్మీకి మహర్షిచే రచింపబడిన శ్రీమద్రామాయణంలోని 'సుందరకాండ'లో ఉన్న సుమారు 2900 శ్లోకాలతో నెల్లూరుకు చెందిన అవధాని కోట రాజశేఖర్ తన మధురమైన గళంతో రూపొందించిన 14 గంటల ఆడియో సీడీని ఇటీవల విశాఖపట్టణంలోని డాల్ఫిన్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఆయన రచించిన 'శ్రీ సీతారామకల్యాణం-బాలకాండ-పద్యసప్తశతి' గ్రంథ ముద్రణకు ఆర్థికసహకారం అందజేసిన అదవికొలను వేంకట్ కుమారుడు రోహిత్ చక్రపాణి సౌజన్యంతో ఈ ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. సభాధ్యక్షులుగా వ్యాసభారతం వచనానువాదకులు సూరం శ్రీనివాసులు పాల్గొని ఆడియో సీడీ విశిష్టతను, అందుకు సహకరించిన అదవికొలను జ్యోత్స్నావేంకట్ దంపతుల ఔదార్యాన్ని కొనియాడారు. అనంతరం ఆ ఆడియో సీడీని వేంకట్ సోదరులు భీమేశ్వర్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ తంబిశెట్టి రామకృష్ణ, నవరస కవిచక్రవర్తి..నల్లాన్ చక్రవర్తుల చక్రవర్తి, డా. రామకృష్ణ పరమహంస, మేడా మస్తాన్‌రెడ్డి, కొప్పోలు వివిఎస్ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు.

# రుద్రాక్షలతో శివలింగ దర్శనం



గూడూరు నరసింగరావుపేటలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు బి.కె.వాణి, ఉష, టి.రఘురామిరెడ్డి, గురునాథంలు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దివ్యమైన 10వేల రుద్రాక్షలతో శివలింగ దర్శనం, హోలోగ్రాఫిక్ షోలో 13 రకాల శివలింగ దర్శనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. ముందుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి జ్యోతిని వెలిగించారు. భక్తులు పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు.

## మార్చి 20 వరకు 'స్పందన' రద్దు

శాసనమండలి ఎన్నికల దృష్ట్యా మార్చి 21 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం మార్చి 20వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రెవెన్యూ డివిజన్ అధికారి ఎం.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు పూర్తి అయిన తరువాత స్పందన కార్యక్రమం మార్చి 27 సోమవారం నుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అవసరమైన వైద్యసేవలు అందిస్తా

### 'డా. సి.ఆర్.రెడ్డి ఆసరా' కార్యక్రమంలో ప్రొ. సి.ఎం.కె రెడ్డి



ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించే 'సిఆర్ రెడ్డి ఆసరా పథకం'లో భాగంగా ఈ నెల 19వ తేదీ గూడూరు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డివిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో 20 మంది నిరుపేద రెడ్ల బంధువులకు పలసరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. సి.ఆర్.రెడ్డి సోదరుడు, ప్రముఖ వైద్యులు ప్రొ. సిఎంకె రెడ్డి మాట్లాడుతూ తనకు తండ్రి సమానులైన మా అన్న సి.ఆర్.రెడ్డి పేరుమీద ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని, మా అన్న బాటలో ప్రయాణిస్తున్న మా కుమార్తె, అల్లుడు డా. సి.రోహిణి, జనార్ధన్‌రెడ్డిలకు ఆ భగవంతుడు మరింత శక్తిని ప్రసాదించి వారెన్నో సేవాకార్యక్రమాలు చేయాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలియజేశారు. భవిష్యత్‌లో వైద్యపరంగా కావలసిన అవసరాలు తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ పేట వెంకట కృష్ణారెడ్డి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, సింహపురి రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఓం నమ:శివాయ'!.. 'హరహర మహాదేవా'!....



- 'శివ'నామంతో హోరెత్తిన ఆలయాలు
- అంగరంగవైభవంగా 'మహాశివరాత్రి' వేడుకలు

**మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శివాలయాల్లో శివనామ స్మరణలు, భజనలు, సంకీర్తనలతో హోరెత్తాయి. 'ఓం నమ:శివాయ' అంటూ, 'హరోం హరా! శంకరా! మహాదేవా!'.. అని ఆ పరమశివుని కీర్తిస్తూ భక్తులు పెద్దపెట్టున శివనామోచ్ఛరణలు చేస్తూ ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. దీంతో శివాలయాలు భక్తజనులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాలను విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానం చేశారు. ఆలయాల్లో అర్చకులు ఆదిదంపతులకు విశేష అలంకారాలు, విశిష్ట పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని తరించారు.**

పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రుద్రయాగాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్ధరాత్రి వేళ లింగోద్భవ పూజలు, అభిషేకాలతో, శివపార్వతులకు విశిష్ట పూజలు, ఆదిదంపతుల కళ్యాణోత్సవాల సంరంభాలతో 'మహాశివరాత్రి' పులకించిపోయింది. ఎక్కడ చూసినా ఆలయాల్లో భక్తజనం వెల్లువెత్తారు. ఈనెల 18న మహాశివరాత్రి పుణ్యదినాన ముక్కంటిని దర్శించుకునేందుకు వేకువఝాము నుంచే భక్తులు ఆలయాలకు కుటుంబాలతో సహా తరలివచ్చారు. జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలైన జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయం, రామతీర్థంలోని రామలింగేశ్వరాలయం, గండవరంలోని ఉదయ కళేశ్వరస్వామి దేవాలయం, సీతారామపురంలోని ఘటికసిద్దేశ్వరాలయం, కోటితీర్థం లోని శివాలయం, సోమశిలలోని సోమేశ్వరాలయం, కృష్ణపట్నం సిద్దేశ్వరాలయం, కాటేపల్లిలోని కామాక్షి సమేత చంద్రశేఖరస్వామి దేవాలయం, సిద్దేశ్వరకోన, భైరవకోనల్లో ఉన్న చరిత్రాత్మక శివాలయాలు, తదితర ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రత్యేకించి నెల్లూరు నగరంలోనూ ప్రజలు మహాశివరాత్రి పర్వదినాన్ని పూజలు, జాగరణలతో, శివనామ ధ్యానంతో ఎంతో భక్తిశ్రద్ధలతోజరుపుకున్నారు.

## మూలస్థానేశ్వరాలయంలో...

నెల్లూరులోని ప్రముఖ శైవక్షేత్రమైన మూలాపేటలోని శ్రీ భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరాలయంలో వైభవంగా జరిగిన మహాశివరాత్రి వేడుకల్లో పెద్దసంఖ్యలో ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు. వేకువనుంచే భక్తులు దైవదర్శనానికి బారులు తీరారు. వేకువన స్వామివారికి పాలాభిషేకం చేయించేందుకు వేలాదిమంది తరలివచ్చారు. రాత్రి 10 గంటల నుంచి ప్రత్యేక పూజలు, లింగోద్భవాభిషేకాలు అర్ధరాత్రి 1 గంట దాకా జరిగాయి. అనంతరం స్వామివారికి వెండి నందివాహన సేవ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కుటుంబసమేతంగా పాల్గొని స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, అధికారులు, ప్రముఖులు మహాశివరాత్రి నాడు మూలస్థానేశ్వరుని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల 20న స్వామివారి రథోత్సవం నయనమనోహరంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో...

మహాశివరాత్రిని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి దేవస్థానంలో కొలువైవున్న శ్రీ మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామికి ఉదయం అభిషేకం, గిన్నెభిక్ష ఉత్సవం ఘనంగా జరిగాయి. అనంతరం స్వామివార్ల కళ్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ప్రముఖ దాతలు, శివభక్తులు ఆల్తూరు గిరీష్‌రెడ్డి దంపతులు ఈ కైంకర్యాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి లింగోద్భవ అభిషేకాల అనంతరం స్వామి వారికి నందివాహనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ పూజల్లో పాల్గొనడంతో ఆలయం భక్తుల రాకపోకలతో కళకళలాడింది.

## అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో...

నెల్లూరు దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలో ఉన్న అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో కొలువైవున్న ఉమా సమేత శ్రీ నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 18వ తేది మహాశివరాత్రి పర్వదినాన శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్టు కార్యనిర్వాహక ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఆద్యంతం అద్వితీయంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ప్రత్యేకంగా ఏకాదశ అభిషేకాలు, ప్రదోషకాలంలో నందీశ్వరునికి, నాగేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి జరిగిన లింగోద్భవ అభిషేకాలు భక్తులను పరవశుల్ని చేశాయి. అనంతరం ఆదివారం రోజున దేవస్థానంలో స్వామివార్ల కళ్యాణోత్సవ వేడుక నయనానందకరంగా జరిగింది.

# 'విలువిద్య'లో గురితప్పని నెల్లూరు బాలలు



ఇటీవల పార్వతీపురంలో జరిగిన అండర్-14, 17 విభాగాల బాలబాలికలకు నిర్వహించిన 'విలువిద్య' (ఆర్చరీ) పోటీల్లో నెల్లూరుజిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో 5 స్వర్ణపతకాలు, 3 వెండిపతకాలు, మరో 2 కాంశ్య పతకాలు సాధించి నెల్లూరు పేరు మారుమోగించారు. పతకాలతో తిరిగొచ్చిన ఆ విద్యార్థులను ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగాభవాని అభినందించారు. పతకాలు సాధించిన చాట్ల అక్షయ్ మహదేవ్, సాయిమౌర్య, ఉజ్వల్ శ్రీనివాస్, నూతన్, ప్రణవిలను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఇటి చంద్రశేఖర్, చాట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘంటసాల పాటలు.. ఆణిముత్యాలు

## నెల్లూరు ఆర్డీఓ మలోల

మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన పాటలు ఆణిముత్యాలని, అవి ఏనాటికీ మరచిపోలేని ఆపాతమధురాలని నెల్లూరు ఆర్డీఓ మలోల ప్రస్తుతించారు. అమరగాయకుడు ఘంటసాల 49వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రముఖ గాయకుడు కోడూరు ఆనందరావు ఆధ్వర్యంలో ఈనెల 19న ఘంటసాల సంగీత విభావరిని నిర్వహించారు. స్థానిక స్వతంత్రపార్కు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల గానం చేసిన భగవద్గీత ఎంతో అపురూపమైనదన్నారు. అనంతరం ఆర్డీఓ మలోల స్వయంగా ఘంటసాల గానం చేసిన పలు పాటలను తన గాత్రంతో అద్భుతంగా గానం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఈ వేడుకలో గాయనీ గాయకులు ఆనందరావుతో పాటు నీలకంఠం, శ్రీనివాసులురెడ్డి, షఫీ, సుజాత, పెంచలరెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొని ఘంటసాల పాటలను గానం చేశారు. అనంతరం స్థానిక గురుకృప కళాక్షేత్రం నిర్వాహకురాలు సురభి గాయత్రి శిష్యబృందం వారి నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నెరసం నిర్వాహకులు జయప్రకాష్, పలు సంస్థల ప్రతినిధులు కృష్ణమూర్తి, విశ్వేశ్వరప్రసాద్, దారా సురేష్, శాంతికుమార్, రఫీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో.. 'ఆరోగ్యమస్తు'



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న 'ఆరోగ్యమస్తు' పేరుతో వైద్యశిబిరం ఏర్పాటుచేసి వాకర్స్‌కు ఆరోగ్యపరీక్షలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని వాకర్స్ 203గవర్నర్ ఎం.వెంకటాద్రి ప్రారంభించారు. సుమారు 200 మంది వాకర్స్‌కు స్థానిక మురళీకృష్ణ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో, దగ్గుపాటి రాధాకృష్ణయ్య సారధ్యంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి తగు సూచనలిచ్చారు. రీజనల్ కోఆర్డినేటర్ ఏకొల్లు రాఘవరెడ్డి, 2022 వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్ రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, జివి కృష్ణయ్య, వి. వెంకటేశ్వర్లు, రమణయ్య, కె సుబ్బారావు, సోను తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...

## పెంచలకోనలో.. దేవాదాయశాఖ అదనపు కమిషనర్

దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రరావు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయాన్ని ఈనెల 19న తమ కుటుంబసభ్యులతో కలసి సందర్శించి పూజలు చేశారు. ఆలయ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్య స్వామి ఆయనను స్వాగతించి దైవదర్శనం చేయించారు.

## కొలనుకుదురులో.. వైభవంగా గంధమహోత్సవం

మనుబోలు మండలంలోని కొలనుకుదురు గ్రామంలో ఇటీవల శ్రీ ఖాదరవ్‌వల్లి గంధమహోత్సవం వైభవంగా జరిగింది. ముస్లిమ్ పెద్దలు కమిటీగా ఏర్పడి ఈ ఉత్సవాన్ని ఎంతో వేడుకగా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు.

## చేజర్లలో.. గండారపమ్మ గ్రామోత్సవం

మండల కేంద్రమైన చేజర్లలో గ్రామదేవత గండారపమ్మ దేవాలయం నిర్మాణం జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ఇటీవల అమ్మవారికి పెద్దఎత్తున పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యంగా సమర్పించారు. వేడుకగా జరిగిన ఈ ఉత్సవంలో గ్రామప్రముఖులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్వనాథరావుపేట విద్యార్థులకు 'విజయదీపికలు'

బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఇటీవల జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సహకారంతో 'విజయదీపికలు' (స్టడీ మెటీరియల్) పంపిణీ చేశారు. సర్పంచ్ జి.మంజుల, జడ్పీటిసి సభ్యురాలు ఎం.కీర్తన, హెడ్మాస్టర్ రవీంద్రనాథ్‌టాగూర్, చెంచులక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరేడు బాలిక.. రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపిక

ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మానస రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 కబడ్డీ పోటీలకు ప్రకాశం జిల్లా జట్టు తరపున ఎంపికైంది. మార్చి నెలలో చిత్తూరుజిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మానస పాల్గొంటుందని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓ.శ్రీనివాసులు తెలిపారు.

## ఇందుకూరుపేటలో.. మాదకద్రవ్యాలపై అవగాహన

మాదకద్రవ్యాలు ఎంతో ప్రమాదకరమని, ఆరోగ్యాన్ని- జీవితాలను సర్వనాశనం చేసే అలాంటి మత్తుపదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలంటూ సెబ్ సిఐ బాలకృష్ణ ఇటీవల ఇందుకూరుపేటలోని జడ్పీ బాలికల పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో వివరించారు. మాదకద్రవ్యాలను వాడినా, కలిగివున్నా, అలాంటివాటిని ప్రోత్సహించినా నేరమని స్పష్టం చేశారు.

## బ్రహ్మదేవి..కైలాసనాథేశ్వరాలయంలో అన్నదానం

ముత్తుకూరు మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో ఉన్న శ్రీ కైలాసనాథేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి రోజున వైకాపా మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్దన్‌రెడ్డి తమ తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం దాదాపు 5వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ కట్టా సుబ్రహ్మణ్యంతో పాటు పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోవూరులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా కోవూరులోని గాంధీపార్కు కూడలిలో గమళ్ళపాళెం యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మెన్ రాధాకృష్ణారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, అనూప్‌రెడ్డి, సురేష్, నాగరాజు, సాయి యశ్వంత్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నాగులవరం శివాలయంలో తెప్పోత్సవం

బోగోలు మండలం నాగులవరం గ్రామ శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ఈనెల 18న కన్నుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ సతీష్‌నాయుడు తదితర దాతల సహకారంతో శివరాత్రి ఉత్సవాలు జరిగాయి.

## 'పద్మభూషణ్' వరప్రసాద్‌రెడ్డి 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా



## అభినవ అన్నమాచార్య వెంకటేష్‌మూర్తి ఆధ్వర్యంలో

## రమణీయం - కమనీయం - తన్మయత్వమయంగా

# శ్రీ శ్రీనివాస కళ్యాణం



**ఆయన పేరు వెంకటేష్‌మూర్తి. ఆయన వృత్తిరీత్యా అర్చకుడు కాదు. పౌరోహిత్యం ఆయన వారసత్వం కాదు. సమాజంలో అందరితో పాటు ఆయనా ఒక సామాన్యుడు, విద్యావంతుడు. కర్ణాటక ఆయన స్వస్థలం. ఒక కార్పొరేట్ సంస్థలో ఉద్యోగి. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి అంటే ఆయనకు అపారమైన భక్తి.**

ఒక పారిశ్రామిక సంస్థలో ఉన్నత ఉద్యోగం ఆయన వృత్తి. "నిత్య కళ్యాణం - పచ్చతోరణం" అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుని, అతి సామాన్యులను సైతం ఆకట్టుకునేలా, కార్యక్రమం ఆసాంతం హృదయానికి హత్తుకునేలా, చదివే మంత్రం, చేసే తంతూ పామరులకు కూడా అర్థమయేలా వివరిస్తూ "శ్రీదేవి - భూదేవీ సమేత శ్రీనివాస కళ్యాణం" నిర్వహించడం ఆయన ప్రవృత్తి. బహుశా సాక్షాత్తూ ఆ శ్రీవారే ఆయనలో మూర్తీభవించినట్లు ఆయన తల్లితండ్రులు గమనించారేమో!.. అందుకే కాబోలు ఆయనకి వెంకటేష్‌మూర్తి అని శ్రీవారి పేరే పెట్టారు. ఆయన సహచర బృందం కూడా కార్పొరేట్ ఉద్యోగులే. అందరూ స్వామివారి భక్తులే.



ఒకానొక సందర్భంలో బెంగళూరులో వెంకటేష్‌మూర్తి నిర్వహించిన శ్రీనివాస కల్యాణాన్ని తిలకించిన శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి తన్మయత్వంలో మునిగిపోయారు. కళ్యాణం జరిపించిన తీరు చూసి మురిసిపోయారు. వెంటనే కన్నడలో ఉన్న వ్యాఖ్యానాన్ని తెలుగులో తర్జుమా చేయించి, ఆయనే స్వయంగా వ్యాఖ్యానం రాసుకుని, తన ఆప్తమిత్రులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం నోట పలికించారు. అంతేకాదు కార్యక్రమం ఆసాంతం సంతోష సంబరంగా, ఆనందమయ వేడుకగా జరిగేలా సాయికృష్ణ యాచేంద్ర గారిచే కమనీయ గీతాలు వ్రాయించి, మాధవపెద్ది సురేష్ స్వరకల్పనలో రికార్డు చేయించారు.

పెళ్ళంటే పెళ్లే, అది అర్చకులు భక్తితో చేసే పూజా కార్యక్రమం కాదు అనిపించేలా ఈ శ్రీనివాస కల్యాణాన్ని ఒక కుటుంబ వేడుకలా, భావోద్వేగ పూరిత, కమనీయ, రమణీయ సంరంభంగా నిర్వహించే వెంకటేష్‌మూర్తికి తెలుగు అనువాద సీడీని అందించారు. గత 20 సంవత్సరాలలో, భారతదేశంలోని కొన్ని భాషల్లో ఇప్పటికి 604సార్లు ఈ "శ్రీనివాస కళ్యాణ వైభవాన్ని" ఆయన నిర్వహించారు. 113 సార్లు తెలుగులో, మిగిలినవి ఇతర భాషల్లో జరిపించారు.

### వరప్రసాద్‌రెడ్డి - వసంతల 50వ పెళ్లి వార్షికోత్సవం కానుకగా...

వరప్రసాద్‌రెడ్డి - వసంత దంపతుల 50 వసంతాల పెళ్లిరోజుని పురస్కరించుకుని, ఫిబ్రవరి 22వతేదీ బుధవారం సాయంత్రం, హైదరాబాదు, గ్రీన్ వాక్‌వేస్‌లోని వారి నివాసంలో కన్నులపండుగగా, వైభోగంగా 604వ శ్రీనివాస కల్యాణాన్ని వెంకటేష్‌మూర్తి, ఆయన సహచర బృందం నిర్వహించారు. తమ కుటుంబసభ్యులు తోడు నిలువగా వరప్రసాద్‌రెడ్డి - వసంత దంపతులు ఈ కళ్యాణానికి పెళ్ళి పెద్దలుగా వ్యవహరించారు.

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేకమంది పారిశ్రామిక, రాజకీయ, సినిమా రంగ ప్రముఖులు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, వరప్రసాద్ రెడ్డి బంధువులు, ఆత్మబంధువులు, ఆప్తులు, ఆత్మీయులు ఈ పెళ్లి సందడిలో పాల్గొని శ్రీదేవి భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించు కున్నారు. అత్యంత భారీగా నిర్మించిన వేదికపై ఆనంద నిలయంలో కొలువైన శ్రీవారిని దర్శింపచేయడమే కాకుండా వచ్చిన ప్రతి అతిథిని సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించి, మంచి విందు భోజనాన్ని వడ్డించి గృహోన్ముఖులని చేశారు వరప్రసాద్‌రెడ్డి దంపతులు. అయిదు దశాబ్దాల అన్యోన్య దాంపత్యంతో, ఆదర్శ ఆలూ మగలుగా నిలచిన ఆదిదంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



## ఫలితమిస్తున్న ఓపిక

(మొదటి పేజీ తరువాయి)

నిండైన మనస్సుతో నింపాదిగా ముందుకు సాగడంతో ఎమ్మెల్సీ అయ్యే అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఈనెల 22న మేరిగ నామినేషన్ వేశారు. స్థానికసంస్థలలో పార్టీకి బలం, బలగం పుష్కళంగా ఉన్నాయి కాబట్టి.. ఆయన విజయం తథ్యమనే అనుకోవచ్చు. మేరిగ మురళికి 'లాయర్' ఆల్ ది బెస్ట్.

## విశ్రాంత పోలీసు అధికారి.. చిన వెంకటరెడ్డి కన్నుమూత



నెల్లూరు జిల్లాలో ఎస్ఐగా, స్పెషల్ బ్రాంచ్‌లో, నెల్లూరుటౌన్ సిఐగా, ఏసీబీ, లోకాయుక్త వంటి విభాగాలలో నిజాయితీగా సుదీర్ఘకాలం పనిచేసి, సమర్థవంతమైన అధికారిగా పేరుతెచ్చుకున్న తియ్యగూర చినవెంకటరెడ్డి ఇటీవల కన్నుమూశారు. ఉద్యోగ విరమణ అనంతరం తన స్వస్థలమైన చిలకలూరిపేటలో స్థిరపడ్డారాయన. ఆయన ఆకస్మిక మరణానికి చింతిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది..'లాయర్'!..

## కాలధర్మం

## ముంగమూరు ఇందిరమ్మ



నెల్లూరుజిల్లా ఏఎస్‌పేట మండలం, రాజవోలు గ్రామంలోని స్వర్గీయ ముంగమూరు వెంకటశివ రామిరెడ్డి ధర్మపత్ని.. ముంగమూరు ఇందిరమ్మ.. ఇక లేరు. ఫిబ్రవరి 18వ తేదీన, తన 80వ ఏట బెంగుళూరులో ఆమె కన్నుమూశారు. రాజవోలులో ప్రముఖ రైతు కుటుంబం, రాజకీయంగా కూడా బాగా పేరున్న కుటుంబం వీరిది. అప్పట్లో ఆ గ్రామ సర్పంచ్‌గా ఇందిరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారంటే ప్రజలతో వారికున్న అనుబంధానికి, ఆత్మీయతకు నిదర్శనం. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామంలో పొణకా చెంచురామిరెడ్డి-రామమ్మలకు జన్మించిన ఇందిరమ్మ, వెంకటశివరామిరెడ్డిని వివాహం చేసుకుని, ముంగమూరు వారింటి కోడలుగా రావడంతో ఆ ఇంటికి మరింత ప్రసిద్ధి వచ్చింది. వీరికి ఇద్దరు కుమారులు.. ముంగమూరు జగన్‌మోహన్‌రెడ్డి, సుకేష్‌రెడ్డి. వీరిద్దరూ విద్యావంతులై సుమారు 30 ఏళ్ళ నుంచీ బెంగుళూరులో ప్రముఖ బిల్డర్లుగా రియల్‌ఎస్టేట్ రంగంలో స్థిరపడ్డారు. తండ్రి శివరామిరెడ్డి కొంతకాలం క్రితమే కన్నుమూశారు. ఇప్పుడు తల్లి లేకపోవడం వారికి మరింత ఆవేదన కలిగిస్తోంది. ఆమె మరణానికి చింతిస్తూ, మాతృమూర్తి మరణంతో శోకసంద్రంలో ఉన్న తనయులకు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!..

## 'రాహు'కాల యోగం ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

ఒక హాంగ్‌కాంగ్‌కి చెందిన కువో ఆయిల్ కంపెనీతో 200 మిలియన్ల అమెరికన్ డాలర్ల ఒప్పందం సందర్భంగా ఇందిరా గాంధీకి ఆమె తనయుడు సంజయ్‌గాంధీకి భారీస్థాయిలో ముడుపులు అందాయన్నది మరో ఆరోపణ.

1984 అక్టోబర్ 31న ఇందిరాగాంధీ హత్యాన్మరణం చెందడం, ఆమె వారసత్వాన్ని కుమారుడు రాజీవ్‌గాంధీ అందిపుచ్చుకుని భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం మనకి తెలిసిందే. అయితే, రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న తరుణంలో 1987లో సంచలనం సృష్టించిన అతిపెద్ద కుంభకోణం 'బోఫోర్స్'. 1.4 బిలియన్ అమెరికన్ డాలర్ల చెల్లింపుతో ఫిరంగుల తరహా యుద్ధ విమానాలు 'హౌవిడ్జర్' కొనుగోళ్లు కోసం స్వీడన్‌తో జరిగిన అతి పెద్ద ఆర్థిక ఒప్పందం వ్యవహారం ఇది. చెల్లించవలసిన దానికన్నా రెండింతలు చెల్లింపులు జరిగాయన్నది రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కేంద్ర ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణ. ఆ కుంభకోణం అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక కుదుపు కుదిపింది.

రాజీవ్‌గాంధీ తరువాత గాంధీ కుటుంబ వారసులు అధికారపీఠంపై కూర్చోకపోయినా కుంభకోణాల పరంపర మాత్రం కొనసాగింది. 2004 – 2014ల మధ్య సోనియాగాంధీ కనుసన్నలలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ భారీ కుంభకోణాలకి వేదికగా మారింది.

"2008లో 1,76,645 కోట్ల రూపాయల 2జి స్పెక్ట్రమ్, అదే ఏడాది బీజేపీ ఎంపిలకు కోట్ల ఎరచూపి కొనుగోలు చేయాలని చూశారన్న దుమారం, 2010లో కామన్వెల్త్ క్రీడల కుంభకోణం, 2011లో దివాస్ – యాంట్రిక్స్ వివాదం, 2012లో బొగ్గు వ్యవహారం, 2013లో హెలికాప్టర్ల కొనుగోలులో స్కాం"... ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి ఉన్న మచ్చలు. తమకింద ఇన్ని మచ్చలున్నాయని మర్చిపోయిన రాహుల్ గాంధీ అదానీ అంశాన్ని అతిపెద్ద కుంభకోణంగా చూపించి కమలాన్ని ఇరకాటంలో పెట్టాలని చేసిన ప్రయత్నం వృథా ప్రయాసగానే మిగిలిపోయింది. బోఫోర్స్ తరహా కుంభకోణంలా అదానీ ఉదంతాన్ని కొండంత చేసి చూపే ప్రయత్నం చేస్తున్నాడు రాహుల్.

ఇప్పుడు కేంద్రంలో అయినా, రాష్ట్రాలలో అయినా పార్టీలు చేయాల్సింది ఒక్కటే. మీరు అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి, ప్రజలకి జరిగిన మేళ్లు ఏమిటి...? రేపు మేము అధికారంలోకి వస్తే ఏం చేస్తాం...! ఇదే మాట్లాడాలి తప్ప.. మేం గుడిని తింటే మీరు గుడిలో లింగాన్ని కూడా మింగేశారు. మా వల్ల వందమంది ఛస్తే.. మీవల్ల వెయ్యిమంది చచ్చారు ..! వంటి అర్థరహిత వాదనల వల్ల ఒరిగే ప్రయోజనం శూన్యమే.

రాహుల్‌గాంధీ "భారత్ జోడో" యాత్ర చేశాడు. ఆ యాత్ర వల్ల రాహుల్ గాంధీ పరపతి, స్థాయి పెరిగాయా..? అని ప్రశ్నిస్తే.. "పరపతి, స్థాయి సంగతి ఏమో తెలియదు కానీ ఆయనకి వయసు, వయసుతో పాటు గడ్డం మాత్రం పెరిగాయి" అన్న సమాధానం వినిపిస్తోంది.

కేవలం భాజపాని విమర్శించినందు వల్ల అయిదు పదులు నిండిన ఈ గాంధీ వారసుడికి జనాదరణ లభించదన్నది కాంగేయుల భావన. ఆయన నాయకత్వం పట్ల ఆయన భరోసా కల్పించాలి. సామాజిక మాధ్యమాల ద్వారా తనను పప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్న ప్రతిపక్షాల కుట్రను వ్యూహాత్మకంగా తిప్పికొట్టాలి. తమది అసలు గాంధీ కుటుంబమే కాదని, తమ పూర్వీకులు ఖాన్‌లని బీజేపీ చేస్తున్న ప్రచారం నిజం కాదని రుజువు చేయాలి. తన సమర్థత, సామర్థ్యం చాటేలా ప్రజా ఉద్యమాలు చేపట్టాలి. కేంద్రంతో పాటు కాంగ్రెసేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలోసైతం ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలను గుర్తించి వాటిపై పోరాటం సాగించాలి. తమ సోదరి ప్రియాంక గాంధీకి ఉన్న చరిష్మాని వాడుకోవాలి.

ఇప్పటికే రెండుసార్లు అధికారం చేజిక్కించుకుని ముచ్చటగా మూడవసారి కూడా స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న గట్టి పట్టుదలతో బీజేపీ పావులు కదుపుతోంది. అందుకనుగుణంగా పథకాన్ని రచించుకుని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గాంధీ కుటుంబానికి ఇదే ఆఖరి అవకాశం. ఈసారి కూడా ఆ పార్టీ అభాసుపాలైతే... ఇక ప్రజాక్షేత్రం నుండి కనుమరుగు కావలసిందే. పార్టీలో మిగిలివున్న అరాకొరా క్యాడర్ కూడా ప్రాంతీయపార్టీల నీడలోకి వెళ్ళిపోతారు. మళ్ళీ కమలనాథుల చేతికే అధికారపగ్గాలు వస్తే, అనగనగా ఒక కాంగ్రెస్ అన్న తరహాలో కాంగ్రెస్ కనుమరుగై చరిత్రలో కలిసిపోవడం ఖాయం. ఇక్కడితో గాంధీ వారసత్వానికి ముగింపు పడిపోయినట్లే భావించాలి.

# 'కృష్ణచైతన్య'లో ఫ్రెషర్స్ డే సంబరాలు



నెల్లూరు సమీ పంలోని కాకుటూరు వద్దనున్న కృష్ణచైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే సంబరాలు ఇటీవల ఎంతో కోలాహలంగా జరిగాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఆర్వి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఈ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 126 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ కళాశాల ఇప్పుడు 14వేల మంది విద్యార్థులతో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో ఒక గొప్ప కళాశాలగా పేరొందిందని, కళాశాలలో విద్యతో పాటు, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను బోధించడం, వృత్తిపరమైన గ్రూప్‌లలోని విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందడానికి అవసరమైన నైపుణ్యం పెంపొందించడం వంటివి కళాశాల ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ యు.మల్లికార్జునయ్య, టి.జ్యోతి, అడ్మిన్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు..

# కిష్టన్న కన్నుమూత


### క్రీడాకారుల నివాళి

ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకుడు, కిష్టన్నగా అందరూ ముద్దుగా పిలిచే వీరిశెట్టి వెంకటకృష్ణమూర్తి ఈనెల 21వ తేది మంగళవారం అనారోగ్యంతో నెల్లూరులోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు.

ఫుట్‌బాల్ క్రీడాకారునిగా రాణిస్తూ, దేశవ్యాప్తంగా ఆయన నెల్లూరు పేరును మారుమోగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్లలో కూడా ఆయనకు మంచి ప్రాతినిధ్యం ఉండేది. నెల్లూరుజిల్లాలో అనేక ఫుట్‌బాల్ అసోసియేషన్లకు ఆయనే పునాది వేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకునిగా ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి బాటలు వేశారు. ఎంతోమంది క్రీడాకారులకు ఆయన తర్ఫీదునిచ్చి ఫుట్‌బాల్‌లో మెరికలుగా తయారుచేశారు. దాదాపు అయిదు దశాబ్దాల పాటు ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి అలుపెరుగని కృషిచేశారు.

అన్నిటికీ మించి ఆయన సహృదయుడు. ఎవరితోనైనా మంచిగా, కలుపుగోలుగా మాట్లాడుతూ ఇట్టే ఆకట్టుకునే వారు. 'మురళీకృష్ణ హోటల్స్' వీరిశెట్టి హజరత్‌బాబుకు ఆయన సోదరుడవుతారు కూడా. ఆయన మరణించారనే విషయం తెలిసిన వెంటనే నగరంలోని పలువురు ప్రముఖులు, ఫుట్‌బాల్ క్రీడాకారులు, అసోసియేషన్ల ప్రతినిధులు టెక్కేమిట్టలో ఉన్న నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, కిష్టన్న మృతి క్రీడారంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్ చీఫ్ కోచ్ యతిరాజ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమాశంకర్ తదితరులతో పాటు అనేక మంది క్రీడాకారులు ఆయనకు నివాళులర్పించారు. సాహిత్యమన్నా, చరిత్ర అన్నా కిష్టన్నకు భలే ఆసక్తి. పుస్తకాలు చదవడమంటే ఎంతో ఇష్టం. ప్రత్యేకించి 'లాయర్'కు ఆయన సన్నిహితులు. ఆయన మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది 'లాయర్'.

# వైసీపీ వ్యతిరేక ఓటు పైనే బాబు ఆశలు!?



సాధారణంగా ఎన్నికల్లో వేసే ఓటు స్వభావం మూడు రకాలుగా ఉంటుంది. ఇప్పటికే అధికారంలో ఉన్న పార్టీ పట్ల ప్రజలలో పెల్లుబికే వ్యతిరేక భావనతో వేసే ఓటు, అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా వేసే ఓటు, తటస్థుల ఓటు.

2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో కంటే కూడా, నరేంద్ర మోడీ అధికారంలోకి రావాలి అనే బలమైన సానుకూల భావనతో దేశం యావత్తు ఎక్కువగా ఓటు వేసింది. అలాగే 2019లో కూడా ఆంధ్రలో తెలుగుదేశం పోవాలి అనే బలమైన భావనతో పాటు, జగన్ రావాలి అనే బలమైన కోరికతో జనం ఓటు వేశారు. దీంతో, ఏపీ ఓటర్ల రెండు కోరికలూ నెరవేరాయి.

టీడీపీకి వచ్చిన స్థానాల సంఖ్యను చూస్తే, చంద్రబాబు పాలన పోవాలని ఆంధ్ర ఓటర్లు ఎంత బలంగా కోరుకున్నారో అర్థం అవుతుంది. అలాగే, జగన్‌కు లభించిన స్థానాల సంఖ్యను చూస్తే, ఆయన అధికారంలోకి రావాలని ఓటర్లు ఎంత బలంగా కోరుకున్నారో కూడా అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు, కుడి ఎడంగా మరో ఏడాదికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు అటు జగన్‌కు , ఇటు చంద్రబాబు పరివారానికి జీవన్మరణ అంశంగా పరిణమించనున్నాయి. ఈ 'మల్ల యుద్ధం'లో పరాజితులైనవారు తిరిగి రాజకీయంగా కోలుకోవడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఇప్పటికే వెయిటింగ్‌లో ఉన్న వివిధ సమస్యలు... భవిష్యత్‌లో ఓడిపోయేవారిని ఒక్కసారిగా చుట్టుముట్టేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ విషయం అటు ముఖ్యమంత్రి జగన్‌కు, ఇటు ప్రతిపక్ష నేత చంద్రబాబుకూ తెలుసు.

అందుకే, ముఖ్యమంత్రి జగన్ ఈసారి కూడా, తన పట్ల 'పాజిటివ్ ఓట్'పైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్టు కనబడుతోంది. ఇందుకు, తాను ఎంచుకున్న 'నవ రత్నాలు' మార్గమే ఉపకరిస్తుందని ఆయన బలంగా నమ్ముతున్నారు. ఈ మార్గానికి తోడు అధికారపార్టీకి స్వతఃసిద్ధంగా ఒనగూరే అదనపు సౌలభ్యాలతో పాటు, సహజ ఓట్ బ్యాంకు అందుబాటులో ఉండనే ఉంటుంది కదా! అందుకనే, 'నెగటివ్ ఓట్'ను కానీ, తటస్థ ఓట్‌ను గానీ ఆయన పెద్దగా పట్టించుకున్నట్టు కనపడదు.

ఎన్ని ఇబ్బందులు, విమర్శలు ఎదురవుతున్నప్పటికీ, ఓటర్లకు నగదు బదిలీలతో పాటు, ఆయన అమలు చేస్తున్న 'సోషల్ ఇంజనీరింగ్'కు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడమే ఇందుకు తార్కాణం. అందువల్ల, తాను నమ్ముకున్న వర్గాల నుంచి లభించే ఓటు – జగన్ నాయకత్వానికి లభించే పాజిటివ్ ఓటు.

అందుకనే, వాటిని మినహాయించి... మిగిలిన నెగటివ్ ఓట్‌పై చంద్రబాబు 100% ఆధారపడుతున్నారు అనిపిస్తోంది. జగన్ వ్యతిరేక ప్రసంగాలు, ప్రచార కార్యక్రమాలకే ఆయన పరిమితమవ్వడం ఇందుకు తార్కాణం. జనంలో కూడా పెద్ద ఎత్తున స్పందన కనిపిస్తోంది.


అయితే, ఆయన అధికారంలోకి రావడానికి ఇది సరిపోతుందా అనే విషయమై ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి.

జగన్ పాలనపై విభిన్న కోణాల్లో అత్యంత నిశిత విమర్శలు కుమ్మరిస్తున్న చంద్రబాబునాయుడు... తెలుగుదేశంను గెలిపిస్తే, ఎలా పరిపాలిస్తారో మాట మాత్రంగా కూడా చెప్పకపోవడం గమనార్హం.

పరిపాలనకు, ముఖ్యమంత్రి పదవికి, చిత్రవిచిత్ర రాజకీయ విన్యాసాలకు చంద్రబాబునాయుడు పెట్టింది పేరు.

1999 నుంచి 2004 ఎన్నికల వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబే ముఖ్యమంత్రి. అలాగే, 2014 నుంచి 2019 ఎన్నికల వరకు కూడా ఆయనే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 294స్థానాలలో... 1999 ఎన్నికల్లో చంద్రబాబుకు 180 స్థానాలు లభించాయి. 2004 వచ్చేసరికి... ఆయనకు కేవలం 47 స్థానాలనే ఓటర్లు ఇచ్చారు. అంటే 1999తో పోల్చుకుంటే, 133 స్థానాలు కోల్పోయారు. స్థానాల పరంగా చూస్తే 84 శాతం సీట్లు కోల్పోయారు. మొత్తం 294 స్థానాలలో కేవలం 16 శాతం స్థానాలే ఆయనకు లభించాయి. ఎందుకు ఇలా జరిగిందో... చంద్రబాబు ఎప్పుడూ చెప్పలేదు.




ఇప్పుడు, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో గల 175 స్థానాలలో... తెలుగుదేశం పార్టీకి ఆయన 2014లో 117 స్థానాలను గెలిపించిపెట్టారు. అంటే, మొత్తం స్థానాలలో 66... 67 శాతం సీట్లను గెలుచుకున్నారు. అదే, 2019 ఎన్నికల నాటికి, 175 స్థానాలలోనూ ఆయనకు 23 స్థానాలనే ఓటర్లు ఇచ్చారు. అంటే, కేవలం 13శాతం స్థానాలే ఆయనకు లభించాయి. ఎందుకు ఇలా జరిగిందో కూడా ఆయన చెప్పలేదు?

దాదాపు తొమ్మిదేళ్ల ముఖ్యమంత్రిత్వం తరువాత, 2004లో 15 శాతం సీట్లు లభిస్తే.. అయిదేళ్ల ముఖ్యమంత్రిత్వం తరువాత 2019లో 13 శాతం సీట్లే లభించాయి. అంటే, ఓటర్ల స్పందన 2004లో గానీ, 2019లో గానీ ఆయన పట్ల దాదాపుగా ఒకే రీతిలో ఉంది.

ఇలా ఎందుకు జరిగిందో చంద్రబాబునాయుడు ఎప్పుడయినా మదింపు చేసుకున్నారో... లేదో తెలియదు. ఎప్పుడూ చెప్పలేదు. తప్పు ఓటర్లదా? చంద్రబాబునాయుడుదా?

ముందు, ఈ విషయం తేలితే, జగన్‌ను అధికారం నుంచి దింపే విషయం ఆ తరువాత తేల్చవచ్చు. ఎందుకంటే, 2019 ఎన్నికల్లో ఓటర్లు జగన్‌ను గెలిపించి తప్పు చేశారు అన్నట్టుగా చంద్రబాబునాయుడు ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్ షోలలో మాట్లాడారు.

ప్రాథమికంగా నాయకులు ఎంత పెద్దవారు అయినప్పటికీ.. ఒక విషయం గమనించాలి. ఓటర్లు ఎప్పుడూ తప్పు చేయరు. రాష్ట్ర పాలనా యంత్రాంగాన్ని మార్చాలి అని ఓటర్లు అనుకుంటే... అది తప్పు ఎలాఅవుతుందో అర్థం కావడం లేదు. ఓటర్లు అటువంటి అభిప్రాయానికి రావడానికి కారణం నాయకులే. ఓటర్లకు ఒకటి చెప్పి, అధికారం చేజిక్కిన తరువాత మరొకటి చేస్తే, ఓటర్లు కూడా తదనుగుణంగానే వ్యవహరిస్తారు.

ఎంతో బలమైన కారణాలు లేకుండా మాత్రం, చంద్రబాబును అధికారం నుంచి రెండుసార్లు దించిఉండరు కదా! ఏమిటా బలమైన కారణాలు? చంద్రబాబు ఎప్పుడైనా రివ్యూ చేసుకున్నారా?

మళ్లీ అధికారంలోకి వస్తే, 1999–2004 మధ్యతో పాటు 2014– 2019 మధ్య ఆయన చేశారని జనం భావించిన తప్పులు ఈసారి చేయకుండా ఉండాలి కదా! మరి, గతంలో దొర్లిన పొరపాట్ల నుంచి చంద్రబాబు గుణపాఠం నేర్చుకున్నారా? నేర్చుకున్నారు... అనడానికి ఎటువంటి సంకేతాలూ లభించడం లేదు.

నిజానికి, రాజకీయ నాయకులు అనేవారు ఎవరూ... తాము పొరపాట్లు చేశామని అంగీకరించరు. అసలు, పొరపాట్లు చేశామనే మాటే అంగీకరించనప్పుడు ఇక, గుణపాఠాలు నేర్చుకునేది ఏముంటుంది? జగన్‌కు ఓట్ వేయడం ద్వారా 2019లో ఓటర్లు తప్పుచేశారు అనే భావం వచ్చే విధంగా చంద్రబాబు ప్రసంగాల సరళి సాగుతోంది. అంటే, 2014 నుంచి 2019 వరకు తాను సాగించిన పాలన అద్భుతమని, లోప రహితమని ఆయన భావిస్తున్నట్టు అనుకోవచ్చు. మరి, 23 అసెంబ్లీ స్థానాలే ఎందుకు వచ్చాయంటే... ఓటర్లదే తప్పిదం అని ఆయన భావిస్తున్నట్టు కనపడుతోంది. అయినప్పటికీ, ఓటు వేయడం... తరువాత నాలుక కరుచుకోవడం మినహా... ఓటర్లకు మాత్రం ప్రత్యామ్నాయం ఉండడం లేదు. 2024 ఎన్నికల్లో సైతం ఇదే వరుస కొనసాగవచ్చు.

ఇంగ్లీష్‌లో ఓ సామెత చెబుతుంటారు.

Between the devil & deep sea అని. దీనినే తెలుగులో చెప్పుకోవాల్సి వస్తే... 'ఏ రాయి అయితేనేం... పళ్ళు ఊడగొట్టుకోడానికి....' అని చెప్పుకోవచ్చు. లేకపోతే...., 'నీ ఎడం చెయ్యి తియ్యి... నా పురచెయ్యి పెడతా...' అని కూడా చెప్పుకోవచ్చు.

ఈసారి ఎన్నికల్లో అధికారంలోకి రావాలని శక్తికి మించి ప్రజాక్షేత్రంలో పని చేస్తున్న చంద్రబాబునాయుడు, జగన్ కంటే ఏ విషయంలో ఎలా జనజీవన స్థితిగతుల మెరుగుదలకు పూచి పడగలరో చెప్పాలి. ఆ విషయం ప్రస్తావించకుండా... జగన్‌ను రకరకాలుగా విమర్శిస్తూ పోతుంటే... ఈ రాజకీయ చదరంగంలో... ప్రజల కోసం కాక మరోసారి ముఖ్యమంత్రి కావడం కోసమే ఆయన అంత తాపత్రయ పడుతున్నారని జనం భావించే అవకాశం లేకపోలేదు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

DEVIREDDY SARADA CHARITABLE TRUST

# కీ॥శే॥ దేవిరెడ్డి శారద గారి 6వ వర్ధంతి

DSR Group

మంచికి మారుపేరుగా నిలచి, ఆప్యాయత అనురాగాలతో... మా గుండెలలో నిలిచిపోయిన అమృతమూర్తి



స్వర్గీయ దేవిరెడ్డి శారద గారు

**6వ వర్ధంతి** సందర్భంగా
(తేది 26-02-2023 ఆదివారము)
స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.


భర్త: **దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి**

కుమార్తెలు - అల్లుళ్ళు
ప్రతిమ - పెళ్లకూరు చైతన్యరెడ్డి
షర్మిళ - డాక్టర్ దొడ్ల ప్రతాప్ రెడ్డి
మనుమడు : పెళ్ళకూరు సాహిత్‌రెడ్డి
మనుమరాలు : దొడ్ల క్రితి

మరుదులు - చెల్లెళ్లు
దేవిరెడ్డి దశరథరామిరెడ్డి - అమరావతి
దేవిరెడ్డి రఘురామిరెడ్డి - శోభ
దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - రాజేశ్వరి
మరియు కుటుంబసభ్యులు

## 2021 - 2022 ట్రస్టు ద్వారా అందించిన సేవలు

### DSCT - హైస్కూలు



6వ తరగతి నుండి 9వ తరగతి వరకు 240 మంది పేద విద్యార్థి, విద్యార్థినులకు ఉచిత, నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్నం భోజనము, పుస్తకములు మరియు యూనిఫారంలు ఉచితముగా అందజేస్తున్నాము.

### DSCT - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్




స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 153 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వబడినది. 30 మంది మహిళలకు బ్యూటీపార్లర్ కోర్సులో శిక్షణ ఇవ్వబడినది. మరియు 76 మంది యువతీయువకులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వబడినది. భవిష్యత్తులో ట్రస్టు ద్వారా యువతీయువకులకు మరెన్నో నైపుణ్య శిక్షణలు ఇవ్వబడును.

### DSCT - ప్రైమరీ హెల్త్ సెంటర్




హెల్త్ సెంటర్ ద్వారా 7823 మందికి ఉచిత వైద్య సేవలు అందించినాము. మరియు 4694 మందికి తక్కువ ధరతో బ్లడ్ టెస్ట్‌లు నిర్వహించబడినవి. ట్రస్ట్ ద్వారా ప్రముఖ వైద్య నిపుణులతో 3 ఉచిత మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించబడినవి. వీటి ద్వారా 852 మంది ఉచిత వైద్యసేవలు అందుకున్నారు.

### DSCT - కన్వెన్షన్ సెంటర్




కన్వెన్షన్ సెంటర్ నందు వివాహాది శుభకార్యములు, రిసెప్షన్లు, వార్షికోత్సవాలు మరియు వ్యాపార సంబంధిత సమావేశాలు నిర్వహించబడినవి.

**తేది : 26-02-2023 ఆదివారము DSCT ట్రస్టులో మెగా రక్తదాన శిబిరం జరుగును.**

దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్, పురిణి - ఇందుపూర్ క్రాస్ రోడ్డు, నార్త్ మోపూరు గ్రామం, అల్లూరు మండలం. సెల్ : 9154854754 www.devireddytrust.com


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com